


# మనం ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

www.manamepaper.com ఆదివారం | 21 | జూన్ | 2026 | పేజీలు : 18


## 30న సీఎం సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- కలెక్టర్ దివాకర టీఎస్
- మూడు రోజుల పాటు రైతు మేళా
- 150 స్టాల్స్ ద్వారా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా అవగాహన కార్యక్రమాలు
- ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష



వివరాలు 2లో..

## పాపం.. ఇమడయ్యా



ప్రమాదంలో రెండు కాళ్ల కోల్పోయిన ఆదివాసీ
చచ్చు పడిన చేతులు
భారంగా మారిన బతుకు
కూలి పనులు చేస్తూ భర్తను పోసిస్తున్న భార్య
ఆరేళ్లుగా ఫించన్ కోసం ఎదురు చూపులు
పట్టించుకోని అధికారులు, రాజకీయ నాయకులు
నేడు ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు

వివరాలు మెయిన్‌లో..

## సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఓటు పోకుండా చూసుకోవాలి
- బిఎల్ఓ, బిఎల్ఏలే కీలకం
- ఖమ్మం నియోజకవర్గ సమావేశంలో మంత్రి తుమ్మల



వివరాలు 17లో..

## ప్రాధాన్యతా రంగాలకు రుణాలు పెంచాలి..



- కలెక్టర్ అంకిత్
- 8,914 కోట్లతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మనంప్రతినిధి):** జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును మరింత పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాలుగో త్రైమాసిక జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్ష కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం శనివారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షత వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డ్ ప్రతినిధులు, వివిధ వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకుల అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యాలు, సాధనపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. 2026 మార్చి 31 నాటికి జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగంలో రూ.4,945.28 కోట్ల లక్ష్యానికి గాను రూ.5,201.20 కోట్లు మంజూరు చేసి 105.18 శాతం సాధన నమోదైనట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగంలో రూ.3,899.28 కోట్ల లక్ష్యానికి గాను రూ.4,351.34 కోట్లు మంజూరు చేసి 111.59 శాతం సాధన నమోదైంది. ఇందులో పంట రుణాల కింద రూ.2,291.82 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,884.65 కోట్లు (82.20 శాతం), అగ్రి టర్మ్ లోన్స్ కింద రూ.1,416.09 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,622.20 కోట్లు 17లో..

## రైతుల పక్షాన నిరంతర పోరాటమే ధ్యేయం

- 17వ లోక్‌సభ ఫ్లోర్ లీడర్గా రైతుల సమస్యలపై గళమెత్తాను
- మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ఎప్పటికీ అండగా ఉంటుందని మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 17వ లోక్‌సభలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్గా రైతుల సమస్యలను పార్లమెంట్ వేదికగా ఎన్నోసార్లు ప్రస్తావించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం చేశానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రైతాంగాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపేలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని ఆయన గుర్తు చేశారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం వంటి భారీ సాగునీటి ప్రాజెక్టులు, విస్తృత స్థాయిలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా మార్చిన ఘనత నాటి కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలియజేశారు. వ్యవసాయం దేశ ఆర్థిక వ్యవస్థ కువెన్నెముక అని, రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని స్పష్టం 17లో..

మనం



# ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాధపాలెం

## రేపటి నుంచి ఎప్ సెట్ కౌన్సిలింగ్ ప్రక్రియ

**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** 2026-27 ఇంజనీరింగ్ కళాశాలల ప్రవేశాలకు సంబంధించిన మొదటి విడత కౌన్సిలింగ్ సోమవారం నుంచి ఈనెల 29 వరకు కొనసాగుతుందని ఎస్ ఆర్ బి జి ఎన్ ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.కళాశాల ఆడిటోరియంలో ఉదయం 9గంటలనుండి సాయంత్రం 6గంటలవరకు ధృవపత్రాల పరిశీలన ఉంటుందని వెల్లడించారు.విద్యార్థులు తాము నమోదు చేసుకున్న విధంగా స్లాట్స్ సమయానుసారం హాజరు కావాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు సమర్పించాలని స్పష్టం చేశారు. ,స్లాట్ బుకింగ్ ఫాం, హాల్ టికెట్, ర్యాంకు కార్డ్, ఎస్.ఎస్.సి మెమో, ఇంటర్ మార్కుల జాబితా, ఇంటర్ టీ.సి, నాల్గవ తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్స్, క్యాస్ట్ సర్టిఫికెట్/ఈడబ్ల్యూఎస్ 2026-27, ఆదాయ ధ్రువీకరణ 2026, ఆధార్ తదితర సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని తెలిపారు. దూర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సమయపాలన పాటిస్తూ కౌన్సిలింగ్ ప్రక్రియ కు హాజరు కావాలని సూచించారు

## వర్తక సంఘంలో మహిళల కోసం సేల్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** సత్య మార్గం యూత్ సర్వీసెస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో 2 రోజులు మహిళల సాధికారత కోసం వారిచే తయారుచేయబడిన ఆహారపదార్ధములు, హెర్బల్ పౌడర్స్, మహిళల కోసం తక్కువ ధరకు చీరలు, సౌందర్య సాధనములు, రెడీమేడ్ దుస్తులు తదితర 30 స్టాలల్స్ ను శనివారం శ్రీ స్థంభాద్రి సేవా సమితి కన్వీనర్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తూములూరి లక్ష్మీ నరసింహారావు ప్రారంభించారు. తదుపరి మహిళలచే ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్ ను పరిశీలించారు. నగర ప్రజలకు, మహిళలకు తక్కువ ధరలో అందుబాటులో ఉంచినందుకు వారందరికీ, ఎగ్జిబిషన్ నిర్వాహకులు సర్వే నగేష్ -లక్ష్మికి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులతో పాటు సేవా సమితి సభ్యులు సుంకర యల్లారావు, పల్లా లింగయ్య, జంగిలి రమణ, దేవరశెట్టి రామారావు, సూరినేటి మల్లేశం, మోతుకూరి భద్రయ్య తదితరులతో పాటు ఛాంబర్ సభ్యులు పాల్గోన్నారు.



## మల్లెల మడుగు డబుల్ బెడ్రూం నివాస ప్రజలకు ఉచిత కంటి వైద్య శిబిరం

**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** ఖమ్మం జిల్లా మల్లెల మడుగు డబుల్ బెడ్రూం కాలనీలో నివాసముంటున్న ప్రజల కోసం శరత్ ఆక్సిజన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి వైద్య శిబిరాన్ని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి సభ్యులు మల్లెల మడుగు డబుల్ బెడ్రూం ప్రెసిడెంట్ బోడా వీరన్న, హాస్పిటల్ సిబ్బంది బి. విక్రం సింగ్, లెనిన్, అనీల్ ప్రారంబించారు. ఈ శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొని కంటి సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు అందించారు. శిబిరానికి కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించాలని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. కాలనీ ప్రజలు శిబిరం నిర్వహించిన నిర్వాహకులకు, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో షేక్ యాకుబ్, రవి రెడ్డి, నరేష్, ఎల్లమ్మ , నాగమణి, వాణి తదితరులు పాల్గొన్నారు.



# 30న సీఎం సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**కలెక్టర్ దివాకర టిఎస్**
**మూడురోజుల పాటు రైతు మేళా**
**150 స్టాల్స్ ద్వారా ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేలా అవగాహన కార్యక్రమాలు**
**ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో సమీక్షించిన కలెక్టర్**

**ఖమ్మం, జూన్ 20(మనం బ్యూరో):** చింతకాని మండలంలో ఈనెల 28, 29, 30 తేదీల్లో రైతుమేళా నిర్వహించనున్నట్లు, అట్టి రైతు మేళా లో ఈ నెల 30 న ముఖ్యమంత్రి ముఖ్య అతిధిగా పాల్గొన్నే సభ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మూడురోజుల పాటు నిర్వహించే రైతు మేళా, ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రైతు మేళా విజయవంతానికి పకడ్బందీ ప్రణాళిక, సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో కార్యచరణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో మధిర నియోజకవర్గం చింతకాని మండలంలో రైతు మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 150 స్టాల్స్ ఏర్పాటు చేసే ఈమేళాకు జిల్లా నుండి రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పండుగలా మార్చుకోవాలని, ఈ అవకాశాన్ని అన్న దాతలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. శాస్త్రవేత్తలు రైతు మేళాలో పాల్గొననున్నందున వారికి బస, రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతు మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డీవో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. పురందర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, పిడి మెప్మా, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## త్రివేణిలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మంలోని త్రివేణి పాఠశాల ఆధ్వర్యంలో శనివారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆరోగ్యం, ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెంపొందించడమే లక్ష్యంగా ప్రతి సంవత్సరం ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'యోగ' భారతదేశం ప్రపంచానికి అందించిన ఒక గొప్ప వరం అని, యోగ ద్వారా ఒక ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజు జూన్ 21 కావటం వలన, ఈ ప్రత్యేకతని పురస్కరించుకుని ఈ రోజుని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకోవాలని 2014, సెప్టెంబర్ 27 న మన ప్రధాని నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితి కి సూచించగా, 193 ప్రతినిధులు ఉన్న ఐక్యరాజ్యసమితిలో శాశ్వత సభ్యులుగా ఉన్న దేశాలతో సహా 175 మంది 2014 లో ఆమోదించారు. మొదటి యోగ అంతర్జాతీయ దినోత్సవం 2015, జూన్ 21న జరుపుకున్నారని తెలియజేశారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ యోగాని నిత్యజీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యోగా ట్రైనర్ చైతన్య కిషోర్ పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయుల తో వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు యోగా ప్రదర్శనలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై పాఠశాల యాజమాన్యం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ వైస్ ప్రిన్సిపాల్ స్వప్న ముస్తఫా క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్ ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్,ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు ఆకిటి వెంకటేశ్వరరావును రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** తెలంగాణ ఉద్యమకారులు ముదిరాజ్ సంఘం నాయకులు ఆకిటి వెంకటేశ్వరరావు ఆలీయాస్ ఏ.వి రావు,ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం జిల్లా కమిటీ, ముదిరాజ్ సంఘం నాయకులు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నుండి తెలంగాణ కోసం ఉద్యమ పార్టీ అయిన టిఆర్ఎస్ పార్టీలో చేరి 2001 మలిదశ ఉద్యమ కారునిగా పాలేరు నియోజకవర్గ వ్యవస్థాపక అధ్యక్షులుగా పని చేసినటువంటి వ్యక్తి ఏవి రావు అని తెలిపారు. అలనాడు ప్రజలకు సేవ చేసే సామాజికవేత్త అభ్యుదయ వాదిగా నాయుడుపేటలో ప్రాముఖ్యమైన పేరు గడించారన్నారు. ఆర్టీసీ ఉద్యోగి అయినప్పటికీ ఉద్యోగాన్ని పక్కనపెట్టి తెలంగాణ ఉద్యమాల్లో అనేక పోరాటాలు చేశారని తెలిపారు. ఆయన ఉద్యమ నేపథ్యం అంతా రాసి పెట్టుకున్నారు ఆనాటి టిఆర్ఎస్ కండువను భద్రంగా దాచి పెట్టుకున్నారని ఇప్పటికీ టిఆర్ఎస్ నేతగానే ఆయన వృద్ధాప్యాన్ని గడుపుతున్నారు. అటువంటి వ్యక్తి ఏవి రావు కుదరని వ్యాధి క్యాన్సర్ గడ్డల రూపంలో వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి నేటి టిఆర్ఎస్ నాయకులు మరియు పాలేరు నియోజకవర్గం మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్యులు, శాసనసభ్యులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్యమ కారుడైన ఏ.వి రావు,ను ఆదుకోవాల్సిన భాధ్యత ఎంతైనా ఉందని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో నాటి టిఆర్ఎస్ మహిళా విభాగం రూరల్ అధ్యక్షురాలు పోతురాజు రమాదేవి, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు రావుల హనుమంతరావు మరియు కొప్పెర జానకి రాములు జాతీయ బీసీ అధ్యక్షురాలు తెలంగాణ ఉద్యమ నేత కొరివి ధనలక్ష్మి బీసీ సంఘం నాయకులు సంగమేశ్వర రావు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం జిల్లా కన్వీనర్ డాక్టర్ పాలకుర్తి కృష్ణ, ఉద్యమ కారుల ఫోరం జిల్లా మీడియా ఇన్చార్జి ఇండిపెండెంట్ జర్నలిస్టు మంద వెంకటేశ్వర్లు, ముదిరాజ్ సంఘం నాయకులు నార్ల శేషయ్య, గోల్కొండ అంజయ్య, కొరివి చైతన్య, మనోహర్, కొమ్ము లక్ష్మి, నాంచారి, పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

## కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ




**తిరుమలాయపాలెం జూన్ 20 (మనం న్యూస్)** యోగం మనిషికి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని అందించే అమూల్యమైన భారతీయ సంస్కృతి సంపద" అని ప్రభుత్వ జూనియర్ కళాశాల పిండిప్రోలు ప్రిన్సిపాల్ రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల, పిండిప్రోలులో శనివారం ఉదయం ఘనంగా యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలను అభ్యసించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ శ్రీ రామకృష్ణ మాట్లాడుతూ, యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మన శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే సమగ్ర జీవన విధానమని అన్నారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, జీవనశైలి వ్యాధుల నుండి బయటపడటానికి యోగా ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి. నారాయణరావు మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచానికి అందించిన అత్యంత విలువైన కానుక యోగా అని తెలిపారు. యోగాభ్యాసం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, సానుకూల దృక్పథం పెంపొందుతాయని వివరించారు. "యోగం ఆరోగ్యానికి మార్గం మాత్రమే కాదు, ఆనందమయమైన జీవితానికి పునాది" అని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ అధ్యాపకులు చంద్రమౌళి, వీరస్వామి మాట్లాడుతూ యోగాభ్యాసం విద్యార్థులు, యువతలో క్రమశిక్షణ, ఏకాగ్రత మరియు వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో దోహదపడుతుంద ని తెలిపారు.ఈ కార్యక్రమం లో అధ్యాపకులు సతీష్, పరశురాం, మురళీకృష్ణ, రామ్మూర్తి , విజయలక్ష్మి, జయశ్రీ, శ్రీలత, ఉపేంద్రచారి, ఉపేందర్, వీరభద్రం, రామదాసు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు. యోగాభ్యాసం అనంతరం అధ్యాపకులు పరస్పరం అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని, ఎన్.ఎస్.ఎస్. విభాగాన్ని పాల్గొన్నవారు అభినందించారు. ఈ సందర్భంగా "ఆరోగ్యవంతమైన శరీరం -- ప్రశాంతమైన మనస్సు -- ఆనందమయమైన జీవితం" అనే సందేశాన్ని అందరికీ చేరవేస్తూ యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

# అరుణోదయ కళాకారుడు భూక్య వెంకన్న మరణం తీరని లోటు.



**తిరుమలాయపాలెం జూన్ 20 (మనం న్యూస్)** సంకకు డప్పు కాళ్లకు గజ్జలు కట్టి సారా (మద్యపానం) ఉద్యమాల్లో. రైతాంగ ఉద్యమాలలో. కూలీల హక్కుల కోసం. దేశంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన కళారూపాలతో ప్రజల్ని చైతన్యంతో పరిచిన అరుణోదయ కళాకారుడు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపంథా) తిరుమలాయపాలెం మండలం బిసరాజు పల్లి గ్రామ నాయకుడు భూక్య వెంకన్న కొద్దిసేపటి క్రితం మరణించిన. మరణ వార్త తెలిసిన వెంటనే మాస్ లైన్ ప్రతినిధి బృందం భౌతిక గాయానికి ఎర్రజెండా కప్పి. రెండు నిమిషాలు మౌనం పాటించి కుటుంబానికి సంతాపం సానుభూతి తెలియజేసినా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ ఖమ్మం జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరావు అన్నారు. వెంకన్న మరణించే వరకు పార్టీ సిద్ధాంతాన్ని కట్టుబడిన నాయకుడని. నమ్మిన ఎర్ర జెండా కోసం ప్రజల పక్షాన నిలబడి పోరాడిన భూక్యా వెంకన్న మరణం అరుణోదయ సంస్థకు. మాస్ లైన్ పార్టీకి తీరని లోటు అని వెంకన్న ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కంకణ బదులు కావాలని నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిల వ్యవసాయ కార్మిక సంఘం ( ఏఐపీకేఎంఎస్) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు. మాస్ లైన్ డివిజన్ నాయకులు ఎడ్లపల్లి నవీన్. అరుణోదయ రాష్ట్ర నాయకులు ఆరంపల వెంకన్న. బానోతు శంకర్ . పి వై ఎల్ మండల కార్యదర్శి పరిక పల్లి మధు. కత్తుల మల్లయ్య.బోడ రమ్య. నోనావత్ తావూరియా. బానోతు సురేష్. సర్పంచ్ మాలోత్ బద్రు. బండారు నాగయ్య. తాళ్లపల్లి వీరస్వామి. తదితరులు పాల్గొన్నారు

# యోగాతో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం





## గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాల కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

## ఉత్సాహంగా ఆసనాలు వేసిన విద్యార్థులు



**కూసుమంచి, జూన్ 20 (మనం న్యూస్) :** కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్ బో స్కూల్ లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్నిపురస్కరించుకొని ముందస్తుగా శనివారం యోగా డే నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా గ్లోబల్ రెయిన్ బో స్కూల్, జేవీఆర్ కళాశాల కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ.. ఆరోగ్య సంరక్షణలో యోగా ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ యోగా సాధన చేయాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే ప్రతిరోజూ యోగా సాధాన చేయాలన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే జీవన విధానమని తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయాలని, దానిని తమ దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో వివిధ యోగాసనాలు చేయించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా చేయడం వల్ల శరీరం ఆరోగ్యంగా ఉండటంతో పాటు మనసు ప్రశాంతంగా ఉంటుందని, ఏకాగ్రత పెరిగి చదువుపై మరింత దృష్టి సారించగలరని తెలిపారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్ జార్జులు జహ్నవి,పాపారావు, నాజియా ఆఫ్రిన్ తదితరులు పాల్గొన్నారు.

మనం



పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

# నేను ఎప్పుడూ జనం కోసం పని చేస్తా

## కాటమయ్య విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న కందాళ



**నేలకొండపల్లి, జూన్ 20 (మనం న్యూస్)** : జనం కోసమే పని చేస్తా ....జనంలోనే తిరుగుతా జనం అంతా నా వాల్లే అని పాలేరు శాసనసభ సభ్యులు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని రాజ్యసభలో గ్రామంలో జరిగిన కాటమయ్య విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య,గ్రామ సర్పంచ్ దండా రంగయ్య, జట్టంగి వెంకన్న, హుస్సేన్ తదితరు భక్తులు పాల్గొన్నారు.

# సివిల్ సర్జరీ చేసిన డాక్టర్ విసంపల్లి వెంకటేశ్వర్లు







**తిరుమలాయపాలెం జూన్ 20 (మనం న్యూస్)** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో వైద్య విధాన పరిషత్ సి హెచ్ సి ఆసుపత్రిలో తొలి సివిల్ సర్జరీ సేవలు మండలం లోని వెదుళ్ళ చెరువు గ్రామానికి చెందిన సీతారాములనే వృద్ధుడు గత కొద్ది సంవత్సరాలుగా ఐడ్రోసిల్ తో బాధపడుతూ ఇన్ఫెక్షన్ గురి కావడంతో శనివారం ఆయన కుటుంబ సభ్యులు తిరుమలాయపాలెం ఆసుపత్రికి తీసుకువెళ్లారు దీంతో ఆసుపత్రి సూపరిండెంట్ కృపా ఉషశ్రీ సివిల్ సర్జన్ డాక్టర్ విసంపల్లి వెంకటేశ్వర్లు, మత్తు డాక్టర్ లవన్ కుమార్ ఆధ్వర్యంలో శాస్త్ర చికిత్స నిర్వహించి హైడ్రోసిల్లి పూర్తిగా తొలగించారు తిరుమలాయపాలెం ఆసుపత్రిలో శనివారం తొలిసారిగా జనరల్ సర్జరీ సేవలు ప్రారంభం కావడంతో డిసిహెచ్ఎస్ రాజశేఖర్ గౌడ్ ఆసుపత్రిని సందర్శించి చికిత్స పొందుతున్న సీతారాములు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. సర్జరీని విజయవంతం చేసిన వైద్యులను అభినందించారు.

# ఖమ్మం రూరల్ ఎస్సైగా వెంకన్నబాబు




**ఖమ్మం రూరల్, జూన్ 20 (మనం న్యూస్)** బోనకల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన వెంకన్నబాబును ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేస్తూ పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బోనకల్‌లో విధులు నిర్వహించిన కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించి మంచి గుర్తింపు పొందారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించిన అధికారిగా పేరుపొందారు. తాజా బదిలీల్లో భాగంగా ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌కు నియమితులైన వెంకన్నబాబు త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, స్నేహితులు, స్థానిక ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

## చనిపోయిన గేదెను ఢీకొట్టిన ఆటో.. ఆరుగురికి గాయాలు..

**కొణిజర్ల, జూన్ 20 (మనం న్యూస్)** కొణిజర్ల మండలం తనికెళ్ళ గ్రామం సమీపంలోని విజయ ఇంజినీరింగ్ కళాశాల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. రహదారిపై చనిపోయి పడిఉన్న గేదెను ఆటో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు ఆటోలో పాల్వంచ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో తనికెళ్ళ గ్రామం సమీపంలోని ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రెండు గేదెలు మృతి చెంది రోడ్డుకు అడ్డంగా పడి ఉన్నాయి.రోడ్డుపై ఉన్న గేదెలను గమనించని ఆటో



డ్రైవర్ ప్రమాదవశాత్తు ఒక గేదెను ఢీకొట్టాడు. దీంతో ఆటో అదుపుతప్పి వరుసగా మూడు పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో ఆటోలో ఉన్న డ్రైవర్‌తో పాటు మరో ఆరుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మున్సిపల్ జవాన్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**వైరా, జూన్ 20 (మనం న్యూస్) :** వైరా మున్సిపాలిటీలో జవాన్ గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గాంధీలాల్ కుటుంబ సభ్యులకు శనివారం వైరా మున్సిపాలిటీ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ రూ.50 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.



జవాన్ గాంధీలాల్ కుటుంబం అత్యంత నిరుపేద స్థితిలో ఉన్న విషయాన్ని తెలుసుకున్న చైర్ పర్సన్ చంద్రకళ, కాంగ్రెస్ పార్టీ డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాపా మురళీకృష్ణ, కౌన్సిలర్ల అందరితో కలిసి ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. అదేవిధంగా శనివారం నిర్వహించిన దశ దినకర్మలో కావా మురళీకృష్ణ, ఉండ్రు శ్యాంబాబు పాల్గొని గాంధీలాల్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్ళు అర్పించారు.

## ప్రజల ఆరోగ్యం పట్ల దృష్టి సారించాలి–జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు

### పారిశుధ్య పనులను పరిశీలించిన డీపీవో రాంబాబు

**కారేపల్లి, జూన్ 20 (మనం న్యూస్) :** ప్రజల ఆరోగ్యం పట్ల అధికారులు దృష్టి సారించి,పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు మండల అధికారులకు ఆదేశించారు. కారేపల్లిలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో పంచాయతీ రాజ్, వైద్యశాఖ సిబ్బందిని అప్రమత్తంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు శనివారం



కారేపల్లిలో పర్యటించారు.డెంగ్యూ కేసు బాధితుల నివాస ప్రాంతాలను సందర్శించి పారిశుధ్యం పనులను పరిశీలించారు. డెంగ్యూ వ్యాప్తి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.బాధితుల కుటుంబ సభ్యులు,పరిసర ప్రాంత ప్రజలకు పరిశుభ్రత,దోమల నివారణపై అవగాహన కల్పించారు.అనంతరం మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి పాఠశాల పారిశుధ్య నిర్వహణ,విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు.పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.డీపీఓ వెంట మండల ఇంచార్జి ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్,ఎంఈవో దుగ్గిరాల జయరాజు,సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్, కార్యదర్శి నెహ్రూ,కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఝాన్సీ సౌజన్య, పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోం... అవినీతిని అరికడతాం

### కౌన్సిల్ సమావేశంలో మహిళా ప్రతినిధులకు రక్షణ ఏది?

### విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కౌన్సిలర్లు

**వైరా, జూన్ 20 (మనం న్యూస్) :** వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి మేము అడ్డు కాదని మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తామని, అవినీతిని అరికడతావని వైరా మున్సిపాలిటీ బీఆర్ఎస్, సిపిఐ, సిపిఎం కౌన్సిలర్లు అన్నారు. శనివారం స్థానిక టిఆర్ఎస్ పట్టణ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు కట్ట స్వరూప రాణి, మాదినేని సునీత తిరుపతి శివకుమారి, చిలక చిన్న కోటయ్య, దొంతబోయిన వెంకటేశ్వరరావు, కిన్నెర కృష్ణ,నల్లమోతు శైలజ, మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో శుక్రవారం జరిగిన రెండో విడత సాధారణ సమావేశంలో 95 అంశాలను ఒకేసారి ప్రవేశ పడటం పట్ల అభ్యంతరం తెలపడంతో మున్సిపల్ చైర్ పర్సన్ కాపా చంద్రకళ భర్త కాప మురళి కృష్ణ కౌన్సిల్ సభ్యుల పట్ల అభ్యంతరకరంగా మాట్లాడటం శోచనీయమన్నారు. ఇలాంటి సంఘటనలో పునరావృతమైతే త్వరలో జరగనున్న సమావేశాలు సైతం అడ్డుకుంటామని అన్నారు.. మున్సిపల్ సమావేశం జరుగుతుండగా సమావేశానికి హాజరైన విలేకరులు వెళ్లిపోవాలని కోరటం అధికారపక్ష కౌన్సిల్ సభ్యుల భర్తలు అక్కడ ఉండి పలు అంశాలపై మాట్లాడుతున్న కౌన్సిలపై మైకు లాక్కోవాలని చెప్పటం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే 12 మంది మహిళా కౌన్సిల్ సభ్యులు ఉండగా వారికి రక్షణ లేకుండా సమావేశం నిర్వహించిన కమిషనర్ రామచంద్రరావు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్



చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఇలా మహిళల పట్ల అభ్యంతరకరంగా మాట్లాడటం ఎలాంటి ప్రజాప్రతినిధి కాకపోయినా మున్సిపాలిటీలో పెత్తనం చలయించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళ ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ సీఎం ఆధ్వర్యంలో మహిళలకు పెద్దపీట వేస్తుండగా వైరా మున్సిపాలిటీలో అగౌరపరచటం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. మహిళా కౌన్సిలర్ల హక్కులను గౌరవాన్ని కాపాడాలని కోరారు. మున్సిపల్ సమావేశంలో పలు అంశాలు అవినీతి మయంగా ఉన్నాయని వెంటనే వాటిని సవరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు వనమా విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణార్జునరావ్, మాజీ మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దిల రవి, మాదినేని దుర్గాప్రసాద్,అప్ప సురేష్, మరికంటి శివ, ఏదునూరి శ్రీనివాసరావు,తిరుపతి శ్రీను, కారుకొండ బోస్, కొంగర సుధాకర్, మిట్టపల్లి కిరణ్, నూకల వాసు, నల్లమోతు సురేష్, కట్ట నాగేశ్వరరావు, వాంకుడోత్ వీరన్న, వేముల శివకృష్ణ, భానోత్ శివ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడే భాష మార్చుకోవాలి

### తెలంగాణ బిసి, ఎస్సీ ఎస్టీ మైనారిటీ అసోసియేషన్ జెఏసి నాయకులు

**వైరా జూన్ 20 (మనం న్యూస్) :** గురుకులాల్లో జీవో నంబర్ 17ను రద్దు చేయాలని ,ఆ జీవో మాటున అయా శాఖలలో 2000 కోట్ల కుంభకోణం జరగలేదని నిరూపించాలి గాని ఆర్ యస్ ప్రవీణ్ కుమార్ పై సీఎం స్థాయిలో బాడీ షేమింగ్ వ్యాఖ్యలు దిగజారుడు తననికి నిదర్శనమని తెలంగాణ బిసి, ఎస్సీ ఎస్టీ మైనారిటీ అసోసియేషన్ జెఏసి నాయకులు హెచ్చరిచారు. ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ అడిషనల్ డిజిపి, బీఆర్ఎస్ నేత ఆర్ యస్ ప్రవీణ్ కుమార్ పై సీఎం రేవంత్ రెడ్డి అసభ్యకరంగా మాట్లాడిన మాటలను వాపస్ తీసుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని స్వేరోస్ నెట్వర్క్ మాజీ జిల్లా అద్యక్షులు,బీసీ, ఎస్సీ ,ఎస్టీ, మైనారిటీ అసోసియేషన్ జాక్ , ఖమ్మం జిల్లా కన్వీనర్ ఉదయ్ స్వేరో డిమాండ్ చేశారు. వైరా లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో టెండర్ లో పాల్గొనాలంటే దాదాపుగా 200 కోట్లు నుండి 250 కోట్ల వరకు టర్నోవర్ చూపించాలని



తెలంగాణకి చెందిన చిన్న, మద్యతరహా కాంట్రాక్టర్లు కుట్రలు చేయటం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలోని పేద వర్గాలకు చెందిన చిన్న కాంట్రాక్టర్ల వద్ద 250 కోట్ల టర్నోవర్ చూపించే స్థాయి ఉన్నదా? అని ఆయన ప్రశ్నించారు. తమ పాలనలో దాదాపుగా 130 మంది గురుకుల విద్యార్థులు చనిపోతే ఏ ఒక్కరిని కూడా ఇప్పటివరకు పరామర్శించే సమయంలో లేని ముఖ్యమంత్రి అదే గురుకులాల స్థాయిలో విద్యార్థులని ప్రపంచ స్థాయిలో తీసుకుని వెళ్లిన ఘనత డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ది అని తెలుసుకొని క్షమాపణ చెప్పాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా జెఎసి, ఆర్ యస్పి సైన్యం నాయకులు శ్రీనాథ్, బి.వెంకటేశ్వర్లు, వైరా నియోజకవర్గ నాయకులు శ్రీధర్,కె.ప్రసాద్ చిరంజీవి, శ్రీనువాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మరణించిన కుటుంబాలకు పీఎస్ఆర్ ట్రస్ట్ అండ

### 44 కుటుంబాలకు రూ.4.40 లక్షల సాయం

**ఖమ్మం రూరల్, జూన్ 20 (మనం న్యూస్)** ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా భావాన్ని చాటుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గత నెలలో కుటుంబ పెద్దలను కోల్పోయిన 44 బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేసింది. శనివారం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి నేరుగా నగదు సహాయాన్ని అందించారు. మొత్తం రూ.4.40 లక్షల ఆర్థిక సహాయం పంపిణీ చేయడం ద్వారా కష్టకాలంలో కుటుంబాలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షులు భూక్య కిషోర్ నాయక్, మాట్లాడుతూ..ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. మరణంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం కొంత ఊరటనిస్తుందన్నారు. సహాయం అందుకున్న కుటుంబ కష్ట సమయంలో తమ ఇంటి వద్దకు వచ్చి పరామర్శించడంతో పాటు



ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అజ్మీర అశోక్ నాయక్, గోనె భుజంగరెడ్డి, కందుకూరి వెంకటనారాయణ,భూక్య సురేష్ నాయక్, వీరారెడ్డి, కొంపల్లి, ఏపూరి తరుణ్, వెంపటి రవి, నూతి సత్యనారాయణ, మహేష్, భద్రకాళి, నూకల రామ్మోహన్‌రెడ్డి, రంజిత్ నాయక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

## 60 వేల రూపాయల విలువైన రంగులతో సరికొత్తగా తీర్చిదిద్దబడిన మాటూరు ఉన్నత పాఠశాల



**మధిర, జూన్ 20 (మనం న్యూస్) :** ఖమ్మంజిల్లాలోని ఏ ప్రభుత్వ పాఠశాల లేని విధంగా సుమారు 60,000 విలువైన రంగులతో అద్భుతంగా తీర్చిదిద్దేలా కృషిచేసిన లిసేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు పోతుకూచి శ్రీ కళ్యాణ్ చక్రవర్తి ని మాటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెరుపల్లి శ్రీహరి నేతృత్వంలో ఉపాధ్యాయ బృందం శనివారం ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీహరి మాట్లాడుతూ పాఠశాలకు అవసరమైన భౌతిక వనరుల అందించడంలో సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ ముందు వరుసలో ఉంటుందని ముఖ్యంగా ఈ పాఠశాలకు ఇప్పటివరకు కుర్చీలు, ఫ్యాన్ లు, బెంచీలు, నోట్ బుక్స్, సీసీ కెమెరాలు, నేమ్ బోర్డులు పెయింటింగ్ ల రూపంలో సుమారు 7 లక్షల రూపాయలు వెచ్చించడం మాటూరు చిన్నారులు, గ్రామస్తుల అదృష్టంగా పేర్కొన్నారు. ఇటువంటి దాతలు అందించే ప్రోత్సాహాన్ని చక్కగా సద్వినియోగం చేసుకొని, చక్కని విద్యాభివృద్ధి సాధించాలని, గత సంవత్సర సాధించిన ఫలితాలు పునరావృతం చేస్తూ మెరుగైన ఫలితాలను సాధిస్తూ దాతల ఆదరాభిమానాలు పొందాలని చిన్నారులకు సూచించారు. అనంతరంవిశ్రాంత ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ సేఫ్ హాండ్స్ ఫౌండేషన్ తో అనుబంధం 2009 నుంచి కొనసాగుతూ వస్తుందని,నిరుపేద ప్రతిభా విద్యార్థుల విద్యాభివృద్ధికి సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ చేసే సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. గతంలో ఉపకార వేతనాలు ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేసిన సేఫ్ హాండ్స్ బృందం గతకొన్ని సంవత్సరాలుగా భౌతిక వనరుల రూపకల్పనలో ముందుంటుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మధిర ప్రాంత లాప్టాప్ భాను ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ వారిలా చేయూతనందిస్తే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని,వాటిని అద్భుతంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. సుమారుగా గత 16 సంవత్సరాలుగా విద్యారంగానికి సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ చేసే సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను ప్రభుత్వ పాఠశాలల లోని నిరుపేద ప్రతిభ విద్యార్థులకు అందించే లాప్టాప్/ డెస్క్ టాప్ ప్రోగ్రాంలో భాగంగా అన్ని వనరులతో అద్భుతంగా తీర్చిదిద్దబడిన మాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకే మొదటి ప్రయారిటీగా 10 డెస్క్ టాప్ అందిస్తూ డిజిటల్ ల్యాబ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.అనంతరం సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీ కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నిరుపేద ప్రతిభ విద్యార్థులకు ఎన్ని రకాల సేవలు చేసినా కూడా అది తృణప్రాయంతో సమానమని, ఇటువంటి నిరుపేద విద్యార్థులకు చేయూతనందించే అవకాశం దొరికినందుకు చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. అన్ని వనరులతో నిరంతరం పాఠశాల విద్యార్థుల శ్రేయోభివృద్ధి కి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందంతో అద్భుతంగా నడుస్తున్న మాటూరు ఉన్నత పాఠశాలకు భాను ప్రసాద్ లాంటి శ్రేయోభిలాషులు కూడా ముందుకు వచ్చి చేయూతనందించటం గొప్ప విషయంగా పేర్కొన్నారు. అనంతరం డి ఎస్ ఆర్ ఎల్ శర్మ ( ద్విభాష్యం సుబ్రహ్మణ్యం రామలింగేశ్వర శర్మ) అంతర్జాతీయ గుర్తింపు పొందిన గణిత పుస్తకాన్ని సేఫ్ అండ్ ఫౌండేషన్ అధ్యక్షులు కళ్యాణ్ చక్రవర్తి చేతుల మీదుగా ఉచితంగా పాఠశాల విద్యార్థులకు అందించడం జరిగింది. ఈకార్యక్రమంలో పాఠశాల సేఫ్ హ్యాండ్స్ ఫౌండేషన్ మదిర ప్రాంత సమన్వయకర్త మేడేపల్లి శ్రీనివాసరావు... పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, పాఠశాల ఉపాధ్యాయులు కొలగాని ప్రసాదరావు చౌడవరపు సునీత, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, లావుడ్య రవికుమార్, పగిడిపల్లి ఇస్సాక్, ఎంపీ ఎ ఎస్ వి ప్రసాద్, కార్యాలయ నిర్వాహకుడు ఎస్కే నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యంపై దగా... నయవంచనకి కేరాఫ్ కాంగ్రెస్

## వ్యవసాయం అంటే దండుగ కాదు పండుగ అని రైతును రాజును చేసిన కెసిఆర్

## ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. దగా రాజ్యం

## రైతు భరోసాకు కోతలు

## రైతు బీమాకు మంగళం పాడిన కాంగ్రెస్

## మాజీ జెడ్పీ ఛైర్మన్ లింగాల కమల్ రాజ్



**మధిర, జూన్ 20 (మనం న్యూస్) :** మధిర బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించారు మీడియా సమావేశంలో లింగాల కమల్ రాజు మాట్లాడుతూ గతంలో 33 రకాల సన్న వడ్లకు ఇచ్చే బోనస్ ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు రకాల కే కుదించి రైతు కంట కన్నీరు తెప్పిస్తున్నదని కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టినారు. అధికారం కోసం రైతులు అందరికీ రెండు లక్షల రుణమాఫీ చేస్తాం అన్ని రకాల సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తాము అని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక తెప్ప తగలేసినట్లు ఉంది కాంగ్రెస్ వ్యవహారము అని దుయ్యబట్టిన కమల్ రాజు. రేవంత్ ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తాము అని చెప్పిన గొప్పలకు రైతుల తిప్పలు బోనస్ ఇస్తుంది అనే ఆశతో రైతులు సన్నాలనే పండిస్తున్నారు కానీ ప్రస్తుతం ఏడు రకాల కు మాత్రమే కుదించి రైతులను మోసం చేస్తుంది అని కాంగ్రెస్ డిఎన్ఏ లోనే మోసం ఉన్నదని విమర్శించినారు. రైతులకు ఏదో చేస్తున్నాము అని చెప్పే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటినుండి ప్రతి విషయంలో మోసం చేస్తున్నది అధికారంలోకి రాకముందు లగేత్తండి పరిగెత్తండి అని చెప్పి రెండు లక్షల రుణం అని మాయ మాటలు చెప్పి అనేకమందికి ఇవ్వకుండా ఎగ్గొట్టింది రైతు భరోసా ఎకరానికి 15000 అని మోసం చేసింది కాంగ్రెస్ అలాగే ఎరువుల కోసం కళ్ళు కాయలు కాసేలా చేసి లైన్లో నిలబెట్టి అది కూడా ఇవ్వటం చేతగాక ఎటువంటి ప్రణాళిక లేక యాప్ ని తీసుకువచ్చి రైతుల కంట కన్నీరు పెట్టిస్తుంది. ఇప్పుడు సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం చేతగాక కేంద్ర ప్రభుత్వంపై సాకులు చెబుతూ ముఖ్యమంత్రి రేవంత్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల, డిప్యూటీ మంత్రి బట్టి తమ చేతకానితనాన్ని బయట పెట్టుకుంటున్నారు అని ఘాటుగా విమర్శించినారు. ఇకనైనా అబద్ధపు మాటలు కట్టిపెట్టి రైతులకు సన్న వడ్లకు 33 రకాల సన్న వడ్లకు గతంలో ఇస్తాము అని చెప్పిన 500 రూపాయల చొప్పున ప్రతి బస్తాకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం ఖమ్మం జిల్లాలోనే ఈ వానాకాలం సీజన్లో 3.20 లక్షల ఎకరాలలో సన్నాల వరి సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచన వేశారని ప్రతి గింజను రైతుల వద్ద నుండి కొనాలని లేనియెడల రైతులతో ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తాము అని హెచ్చరించినారు రైతులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వము మనుగడ కూడా సాధించలేదని అది తెలుసుకొని రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేసినారు.ఈ సమావేశంలో మధిర మేజర్ సొసైటీ అధ్యక్షులు బిక్కి కృష్ణ ప్రసా,ద్ మధిర మున్సిపాలిటీ బీఆర్ఎస్ వార్డ్ కౌన్సిలర్ వైవిఅప్పారావు, రాయపట్నం సర్పంచి కంచం గోపి, టిఆర్ఎస్ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, పల్లపోతు వెంకటేశ్వరరావు వంకాయలపాటి నాగేశ్వరావు ,మొండితోక జయాకర్, రంగిశెట్టి కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ ధీరావత్ మాధవి, బిఆర్ఎస్ నాయకులు ఆళ్ల నాగబాబు, ఆయిలూరి ఉమామహేశ్వర్ రెడ్డి, కటికల సత్యనారాయణ రెడ్డి, పరిశ శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, బొగ్గుల వీరారెడ్డి, పల్లపాటి కోటేశ్వరరావు, రాయుడి భద్రయ్య, మొరుబోయిన ప్రసాద్, పరిటాల పూర్ణచంద్రరావు నాగులవంచ రామారావు, కోట కోటేశ్వరరావు ఆరుద్ర కొండలరావు, నీలం రమేష్, అబ్బురి రామన్, జల్లా ప్రవీణ్, దిల్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం



# మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

## వెంకటేశ్వరునికి ఘనంగా ప్రత్యేక పూజలు



**ఎర్రుపాలెం, జూన్ 20 (మనం న్యూస్) :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటే శ్వరస్వామి వారికి అమ్మవార్లకు శనివారం పంచా మృతాలతో సర్వాంగాభిషేకమును ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ముత్యాల అలంకార రూపంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు.స్వామివారికి అమ్మ వార్లకు నిత్య కళ్యాణం ప్రధాన అర్చకులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు శనివారం కావడంతో ఆలయానికి వేలాదిగా భక్తులు వచ్చి స్వామివారి ని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకు న్నారు వచ్చిన భక్తులు స్వామివారి ఆలయంతో పాటుగా అన్ని ఉపఆ లయాలను దర్శించు కున్నారు.మహిళ భక్తులు పొంగళ్ళు చేసి స్వామి వారికి నివేదన చేసి తమ మొక్కులు చెల్లించు కున్నారు.ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచిత అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహనరావు సీనియర్ అసిస్టెంట్ సోమయ్య,ముఖ్య అర్చకులు ఎం వెంకటరమణ,మురళీ మోహన శర్మ,రఘురామ కృష్ణ శాస్త్రి రాజీవ్ శర్మ చక్రధర్ రామకృష్ణ శాస్త్రి,వేద పండితులు విజయకృష్ణ,సాయి అభిలాష్ శర్మ,భక్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన చింతకాని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్



**చింతకాని జూన్ 20 మనం న్యూస్** మండలంలోని బస్వాపురం గ్రామంలోని బిళ్ల స్వప్న--వీరభద్రరావు కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉన్న రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గృహ వసతి కల్పించేందుకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేదలకు శాశ్వత నివాసం లభిస్తోందని తెలిపారు. ఇల్లు ప్రారంభమైన సందర్భంగా లబ్ధిదారులు బిళ్ల స్వప్న, వీరభద్రరావు కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో...సయ్యద్ ఉస్మాన్,పోలిడి శ్రీకాంత్, కన్నెబోయిన పాండు రంగారావు, మెండే నాగేశ్వరావు, బొడ్డు రత్తయ్య, పోలినీడి వెంకటేశ్వర్లు,అందే సైదులు, దొడ్డ సోంబాబు, రమేష్,వరికూటి వెంకటి, గ్రామ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వివో కార్యాలయ భవన నిర్మాణ స్లాబ్ పనులను ప్రారంభించిన సర్పంచ్ ఆవుల నాగేశ్వరావు




**చింతకాని జూన్ 19 మనం న్యూస్** వందనం గ్రామంలో నిర్మాణంలో ఉన్న వివో కార్యాలయ భవనానికి స్లాబ్ పనులకు పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి పనులను సర్పంచ్ నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా..సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వివో కార్యాలయ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాలు, బ్యాంకు లింకేజీ కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు, సంఘాల లెక్కల నిర్వహణ వంటి కార్యకలాపాలకు ఈ కార్యాలయం కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ఈ భవనం కీలకంగా నిలుస్తుందని, మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో.. ఏ ఈ రఘు,గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, అధికారులు, గ్రామస్తులు, తదితరులు,పాల్గొన్నారు.

# మనం సత్తుపల్లి



సత్తుపల్లి - వేంసూరు - పెనుబల్లి - కల్లూరు - తల్లాడ



## బాసర ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

**సత్తుపల్లి టౌన్, జూన్ 20 (మనం న్యూస్) :** సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి నారపోగు రామ్ చరణ్ తేజ్ బాసర ఐఐటీలో సీటు సాధించిన సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం విద్యార్థిని ఘనంగా అభినందించి, అతని భవిష్యత్ విద్యాభ్యాసంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థి విజయంలో కీలక పాత్ర పోషించిన టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పులి శ్రీనివాస్ రావుతో పాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందిని కూడా అభినందించారు. కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని ఈ విజయం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## అప్పులు చెల్లించకుండా ఆస్తుల విక్రయానికి యత్నిస్తున్న వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

### సబ్ రిజిస్ట్రార్‌కు, ఎమ్మెల్యేకు బాధితుల వినతి



**సత్తుపల్లి టౌన్ , జూన్ 20 ( మనం న్యూస్ ) :** సత్తుపల్లి మండలం బి. గంగారం గ్రామంలో మెస్సర్స్ రామకృష్ణ ట్రేడర్స్ పేరుతో ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్న ముల్లంగి సాంబశివారెడ్డి తమ వద్ద, మరికొందరి వద్ద సుమారు రూ.2 కోట్ల మేరకు అప్పులు తీసుకుని, ప్రస్తుతం వాటిని చెల్లించకుండా ఎగవేతకు ప్రయత్నిస్తున్నాడని బాధితులు ఆరోపించారు. బాధితుల వివరాల ప్రకారం, వ్యాపార, కుటుంబ అవసరాల నిమిత్తం సాంబశివారెడ్డి పెద్ద మొత్తంలో డబ్బులు అప్పుగా తీసుకుని, అందుకు హామీగా ప్రామిసరీ నోట్లు, చెక్కులు అందజేశాడు. స్థానికంగా పెద్ద వ్యాపారవేత్తగా పేరు ఉండటం, స్థిరాస్తులు కలిగి ఉండటంతో అతనిపై నమ్మకం ఉంచి తాము అప్పులు ఇచ్చినట్లు తెలిపారు. అయితే గడువు ముగిసినప్పటికీ బాకీలు చెల్లించకపోవడంతో విచారణ జరపగా, అతను పలువురికి భారీ మొత్తంలో అప్పులు చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. తమకు రావాల్సిన డబ్బుల గురించి ప్రశ్నించగా, అప్పులు చెల్లించకుండా తప్పించుకునే ఉద్దేశంతో గౌరవ సీనియర్ సివిల్ జడ్జి, సత్తుపల్లి కోర్టులో ఇన్సాల్వెన్సీ పిటిషన్ (ఐ.పి.) దాఖలు చేసినట్లు తెలిపారు.

సదరు పిటిషన్లో తన ఆస్తుల వివరాలను కోర్టుకు సమర్పించినప్పటికీ, ప్రస్తుతం అదే ఆస్తులను ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తూ రుణదాతలను మోసగిస్తున్నాడని బాధితులు ఆరోపించారు. ఈ చర్యల వల్ల తాము తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మోరంపూడి ఇందిర, గువ్వల పద్మారెడ్డి, తేజావత్ నాగేశ్వరరావు, వంకదారు వాసుదేవరావు, ఉప్పే నరేష్, ఓరుగంటి వెంకటేశ్వరరావు, ఎస్.కే. నాగుల్ మీరా, పొదిలి జయమ్మ, కోలగట్ల చెన్నారావు, కె. సాంబశివరావు, మానికల రాంబాబు, ఎస్.కే. బాబా, ఎస్.కే. ఖాసిం, డాక్టర్ జనార్ధన్, వంకదారు గోపాలరావు తదితర బాధితులు సత్తుపల్లి సబ్ రిజిస్ట్రార్ను, సత్తుపల్లి ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సమర్పించారు. ముల్లంగి సాంబశివారెడ్డి కోర్టుకు సమర్పించిన ఆస్తులను విక్రయించకుండా అడ్డుకుని, బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## బుగ్గపాడు ఫుడ్ పార్క్ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

### 3 వేల మందికి ఉపాధి కల్పించే రూ.660 కోట్ల ప్రాజెక్టుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది

### అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు: ఎమ్మెల్యే రాగమయి



**సత్తుపల్లి టౌన్ , జూన్ 20 (మనం న్యూస్) :** బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ భూ వివాదంపై కొందరు రాజకీయ నాయకులు, పార్టీలు వాస్తవాలను వక్రీకరిస్తూ విషప్రచారం చేస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి విమర్శించారు. శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

**ఫుడ్ పార్క్ లక్ష్యం ఉపాధి కల్పనే**

గ్రామీణ, గిరిజన ప్రాంతాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో బుగ్గపాడు ఫుడ్ పార్క్‌ను ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. 2008 నుంచి 2014 వరకు రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో 61.13 ఎకరాల భూమిని సేకరించి మెగా ఫుడ్ పార్క్ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు.

**రూ.109 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి**

ఫుడ్ పార్క్ అభివృద్ధికి ఇప్పటివరకు సుమారు రూ.109 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. కొన్ని కంపెనీలు ఇప్పటికే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశాయని, మరిన్ని పరిశ్రమలను ఆకర్షించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**పదేళ్లుగా నిలిచిపోయిన ప్రాజెక్టుకు పునర్జీవం**

గత పదేళ్లుగా నిరుపయోగంగా మారిన ఫుడ్ పార్క్‌ను మళ్లీ అభివృద్ధి బాట పట్టించామని తెలిపారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఫుడ్ పార్క్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

**రూ.660 కోట్ల పెట్టుబడితో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్**

దీపక్ నెక్స్ట్ జెన్ కంపెనీ సుమారు రూ.660 కోట్ల పెట్టుబడితో రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 3,000 మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

**స్థానికుల ఆమోదంతోనే భూముల కేటాయింపు**

ప్రాజెక్టు కోసం ఇతర ప్రాంతాల్లో కూడా భూములు పరిశీలించినప్పటికీ, బుగ్గపాడులో ఏర్పాటు చేయడం ఉత్తమమని భావించి స్థానిక ప్రజల ఆమోదంతోనే భూములు కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో ఎలాంటి అక్రమాలు లేదా చెడు ఉద్దేశాలు లేవని పేర్కొన్నారు.

**అభివృద్ధిని చూసి ఓర్వలేక విమర్శలు**

ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుండటాన్ని చూసి కొందరు ప్రతిపక్ష నాయకులు రంధ్రాన్వేషణ చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం కాకుండా ప్రజల ప్రయోజనాల కోసం అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి టౌన్, జూన్ 21 (మనం న్యూస్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తుపల్లిలోని త్రివేణి స్కూల్‌లో ఘనంగా యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తెలుపు రంగు యూనిఫామ్‌లలో పాల్గొని వివిధ యోగా ఆసనాలను క్రమశిక్షణతో ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం. సరిత మాట్లాడుతూ, "యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన కానుక. యోగాను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవడం ద్వారా విద్యార్థులు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు" అని పేర్కొన్నారు. పాఠశాల పీఈటీ పాపారావు యోగాలోని వివిధ ఆసనాలను విద్యార్థులకు ప్రదర్శిస్తూ, వాటిని సరైన విధానంలో చేయాల్సిన పద్ధతులను వివరించారు. యోగా సాధన వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఆయన వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, అకాడెమిక్ ఇన్‌చార్జ్ పవన్ పాల్గొన్నారు. త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి, సీఆర్వో మురళీకృష్ణ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, క్రమశిక్షణ, యోగాపై ఆసక్తిని పెంపొందించడంలో ఈ కార్యక్రమం విజయవంతమైందని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.

## యోగాతో ఆరోగ్యం.. ఆరోగ్యంతో ఆనందం





**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశ్వశాంతి విద్యాలయంలో యోగా అవగాహన కార్యక్రమం**

**సత్తుపల్లి టౌన్ , జూన్ 20 (మనం న్యూస్) :** అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21) పురస్కరించుకుని స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో శనివారం యోగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ యోగా గురువు రాజరత్నాచారి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించారు. యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరమని, శరీరం-మనస్సు-ఆత్మల సమతుల్యతకు యోగాభ్యాసం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యోగాను నిత్యం సాధన చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని వివరించారు. ప్రతి విద్యార్థి రోజూ కనీసం 20 నిమిషాల పాటు యోగాభ్యాసం చేయాలని సూచిస్తూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఒక శక్తివంతమైన సాధనమని అన్నారు. అలాగే విశ్వశాంతి సాధనలోనూ యోగా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని తెలిపారు. అనంతరం వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.
కొత్తగూడెం
కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

### – సింగరేణిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



**కొత్తగూడెం సింగరేణి, జూన్20(మనం న్యూస్):** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పాఠశాల విధ్యార్థినీ విద్యార్థులతో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జిఎం(క్వాలిటి) సిహెచ్.వెంకట రమణ, జిఎం(ఓసిపి) పి.ఎలిషా, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్సి ఏజేఎం మురళిధర రావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ఎస్.పితాంబర రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎస్.వెంకటా చారిలు పాల్గొని ప్రసంగించారు. మన భారతదేశంలో పుట్టినటువంటి యోగా అంతర్జాతీయంగా గుర్తించబడి మానవాళికి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగ పడుతుందని యోగాని అన్ని దేశాలకు విస్తరించాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ వ్యాప్తముగా ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే నినాదం తో నిర్వహించుకుంటున్నామని దీని ద్వారా ప్రతీ వ్యక్తి యొక్క ఆరోగ్యం దాని వల్ల కుటుంబం కుటుంబం వల్ల సమాజం అందరూ శారీరకముగా మానసికముగా బాగుంటారని అన్నారు. గత 12 సంవత్సరాలుగా సింగరేణి సంస్థ యోగాకు పూర్తి సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తోందని దీని కొరకు ప్రత్యేకముగా బడ్జెట్ ను కూడా కేటాయించి యోగాను నిరంతరాయంగా ఆచరించడం కోసం యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని కార్మికులు కూడా యోగాను ఆచరిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని వారు పిలుపునిచ్చారు. ఈ యోగా ఆచరణతో వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు పని సామర్థ్యం మెరుగవుతుందని తద్వారా ఉద్యోగుల కుటుంబాలకు కంపెనీకి మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

యోగా వల్ల బీపీ మధుమేహం వంటివి నియంత్రణలో ఉంటాయని ముఖ్యంగా ఎక్కువ సేపు కూర్చుని పనిచేసే ఉద్యోగులు పని ఒత్తిడికి గురి అయ్యేవారు రోజుకు కనీసం 30 నిమిషాలపాటు యోగా సాధన చేయడం వల్ల పూర్తిస్థాయి ప్రయోజనం పొందుతారన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్యకళాకారిణి సీతాప్రసాద్ బృందంచే యోగాపై నృత్యం చేసి అందరికీ యోగపై అవగాహన కల్పించారు.

అనంతరం కార్యక్రమంలో భాగంగా అందరూ కలిసి యోగా ప్రతిజ్ఞ స్వీకరించి సామూహిక యోగాసనాలు వేశారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ ఄ సిఎస్ఆర్ శ్రీ జి.వి.కిరణ్ కుమార్ గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, ఉద్యోగులు, ఇతర అధికారులు, ఎస్ అండ్ పిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి మహిళా కళాశాల నర్సింగ్ కళాశాల విధ్యార్థినులు యోగా మాస్టర్లు పాల్గొన్నారు.

# కుంజా వనజ మృతిపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రవీందర్ నాయక్ ఆరా!

### – ప్రోగ్రాం అధికారులతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



**కొత్తగూడెం టౌన్ జూన్ 20 (మనం న్యూస్ ) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న కుంజ వనజ మృతి ఘటనపై డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఄ ఫ్యామిలీ వెల్ఫేర్ డా. రవీందర్ నాయక్ జిల్లాకు విచ్చేసి కుంజా వనజ మృతి సంఘటనపై సమగ్రంగా ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఄ ఆరోగ్య అధికారి డా. తుకారాం రాథోడ్, మరియు రవిబాబు సంబంధిత వైద్య అధికారులు, ఆరోగ్య సిబ్బందితో సమావేశమై గర్భిణికి అందించిన వైద్య సేవలు, చికిత్స వివరాలు, రిఫరల్ ప్రక్రియ, సంఘటనకు దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణలో ఎలాంటి లోపాలు జరిగాయో సమగ్రంగా విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విచారణ నివేదికను త్వరితగతిన ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.తదుపరి డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ జిల్లా వైద్య ఄ ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, మాతా–శిశు ఆరోగ్య సేవలు, కుటుంబ నియంత్రణ, వ్యాధి నియంత్రణ కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధుల (ఎన్ సి డి) స్క్రీనింగ్, టీకా కార్యక్రమం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల పనితీరు, సికిల్ సెల్ అనీమియా నియంత్రణ కార్యక్రమం, క్షయవ్యాధి నిర్మూలన, కుష్ఠ నిర్మూలన, వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ తదితర అంశాలపై కార్యక్రమాల వారీగా సమీక్ష నిర్వహించారు.ప్రతి కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను శాతానికి శాతం సాధించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్య సంస్థల్లో గర్భిణులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో రిఫరల్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.మాతా–శిశు మరణాల నివారణకు ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని డైరెక్టర్ డా. రవీందర్ నాయక్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ తుకారాం రాథోడ్ డి ఎం హెచ్ ఓ , డాక్టర్ రవిబాబు డి సి హెచ్ ఎస్, డాక్టర్ ప్రతాప్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్ ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్దినేష్ ప్రోగ్రాం ఆఫీసర్, మోహన్, రామ్ ప్రసాద్ , విప్లవ్ కుమార్, సలిత, శ్రీధర్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





# భద్రాద్రి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం

### – జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**కొత్తగూడెం టౌన్, జూన్ 20 (మనం న్యూస్) :** భద్రాద్రి జిల్లా బిజెపి జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని కావున ప్రతి బిజెపి కార్యకర్త పార్టీ కోసం పనిచేస్తూ పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయాలని అన్నారు. అదేవిధంగా తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వము 6 గ్యారంటీలు 420 హామీలతో అధికారంలోకి వచ్చింది. కానీ హామీలను నెరవేర్చటంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని బలహీనపరిచిందని రైతులకు రైతు భరోసా ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని, అదేవిధంగా ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు లో పూర్తిగా విఫలమైందని అన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వము ఎలాగైతే ప్రజలను మాయమాటలు చెప్పి మోసం చేసిందో ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అలాగే చేస్తూ ప్రజలని మోసం చేస్తుందని అన్నారు. అదేవిధంగా అధికారంలోకి వస్తే జాబు కాలండర్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు కానీ నేటికీ అది అమలు కావడం లేదు దీనివల్ల యువత పెద్ద ఎత్తున నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కూడా రేవంత్ రెడ్డి సర్ పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి కరణం సాయి పరిణితి మాట్లాడుతూ ప్రతి బిజెపి కార్యకర్త తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వము వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలని అదేవిధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వము ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపులో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా అధ్యక్షులు కె.వి.రంగా కిరణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మా ,పొడియం బాలరాజు, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యం బిక్షపతి, డాక్టర్ వెంకన్న, భోగి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు భూక్య దివ్యశ్రీ, ఎస్ ఐ ఆర్ జిల్లా కన్వీనర్ మోహన్ కృష్ణ, జిల్లా ఆఫీస్ సెక్రటరీ కుమార్ వివిధ మండలాల అధ్యక్షులు ఇతర సీనియర్ నాయకులు హాజరయ్యారు



# కార్పొరేట్ టీబీజీకేఎస్ ఆఫీసులో పోస్టర్ ఆవిష్కరణ

**కొత్తగూడెం టౌన్, జూన్ 20 (మనం న్యూస్) :** కొత్తగూడెంలో జరిగే సింగరేణి పరిరక్షణ సదస్సును జయప్రదం చేయండి పోస్టర్ ఆవిష్కరించిన కాపుకృష్ణ ముఖ్య ప్రధాన కార్యదర్శి టీబీజీకేఎస్. కార్పొరేట్ ఆఫీసులో వైస్ ప్రెసిడెంట్లు తుమ్మ శ్రీనివాస్, గడప రాజయ్య ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాపు కృష్ణ పాల్గొని పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది . వారు మాట్లాడుతూ సింగరేణి లో జరుగుతున్నా ఇబ్బందికర పరిస్థితులు మెడికల్ బోర్డు నిర్వహించడం, 250 ఇంటి స్థలం, మారుపేరుల సమస్య అన్నింటి మీద హరీష్ రావు చేత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుంది కాబట్టి కార్మిక సోదరులందరూ పాల్గొనాలని కార్మికులకు తెలియజేస్తూ ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరుతూ పోస్టరు ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాస్, మీసాల మురళి,నమిల్ల వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రవి, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం




## విద్యుత్తు ప్రైవేటీకరణ ప్రతిపాదనను విరమించాలి : టీఎస్ పీ ఈ జేఏసీ

### – రెండో రోజు కొనసాగిన నిరసన

**పాల్వంచ, జూన్ 20(మనం న్యూస్):** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ( వై టి పి ఎస్ ) విభాగాల ప్రైవేటీకరణ ప్రతిపాదనను ప్రభుత్వం తక్షణం విరమించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. కేటీపీఎస్ కాంప్లెక్స్ లో కొనసాగుతున్న నిరసన శుక్రవారం రెండో రోజుకు చేరింది. మధ్యాహ్నా భోజన విరామ సమయంలో కేటీపీఎస్ ఏడవ దశ ప్రధాన గేటు వద్ద ఉద్యోగులు, కార్మికులు, ఆర్టీజన్ లు జేఏసీ పిలుపుమేరకు నల్ల బ్యాడ్జీలతో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ లోని ఏ హెచ్ పి (ఆష్ హ్యాండ్లింగ్ ప్లాంట్) మరియు సిహెచ్ పి ( కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ ) విభాగాల ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలను తీవ్రంగా ఖండించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించడం వల్ల ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని, అలాగే ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన, విశ్వసనీయమైన, నిరంతర విద్యుత్ సేవలను అందించాలంటే ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. వై టి పి ఎస్ విభాగాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలు, సంస్థ భవిష్యత్తు, రాష్ట్ర విద్యుత్ రంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎస్.కె. యస్మీన్, బ్రహ్మాజీ, మహేష్, రఘువీర్, రాధాకృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. శాంతియుత వాతావరణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

## దాట్ల హై స్కూల్ లో ఘనంగా యోగా దినోత్సవం

**ఖమ్మం, జూన్ 20(మనం న్యూస్):** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాట్లలో ప్రధానోపాధ్యాయులు కొమ్మవరపు కృష్ణయ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల పి డి సాయి కుమార్ పిల్లలచే యోగ



చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎమ్ కృష్ణయ్య మాట్లాడుతూ యోగ దినోత్సవం రోజే కాకుండా ప్రతి రోజు ఉదయం సాయంత్రం క్రమం తప్పకుండా యోగ చేయడం వల్ల మానసిక, శారీరక రుగ్మతలు తొలిగి ఆరోగ్యంగా జీవిస్తారని, తద్వారా ఆరోగ్య కరమైన సమాజం తయారవుతుందని , పిల్లలుగా మీరు రోజు విధిగా యోగ చేయడం వల్ల మీరు ఆరోగ్యంగా ఉంటూ జ్ఞాపక శక్తి కూడా అభివృద్ధి చెంది చదువులో బాగా రాణిస్తారని వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విజయ్ కుమార్, స్వప్న, రమేష్, ప్రేమ్ కుమార్, రామయ్య, యాకస్వామి , రిషిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థికి శృతి మించిన దండన

- విద్యార్థిని చితకబాదిన “రెజీనా” కాన్వెంట్ నిర్వాహకులు
- బొబ్బలెక్కిన విద్యార్థి చేతులు
- వరుస ఘటనలతో అభాసు పాలవుతున్న మైనారిటీ విద్యాసంస్థ
- పాఠశాల యాజమాన్యంపై చర్యలు చేపట్టాలి
- విద్యార్థి తల్లిదండ్రులు

**పాల్వంచ, జూన్ 20(మనం న్యూస్):** వరుస వివాదాలతో పాల్వంచ రెజీనా కార్మెల్ విద్యాసంస్థ రచ్చకెక్కుతోంది. నిర్బంధ విద్య పేరుతో ప్రతి చిన్న అంశాన్ని భూతద్దంలో చూపి, చిన్నారులకు పాఠశాల యాజమాన్యం నరకం చూపిస్తోంది. విద్యాబుద్ధులు నేర్పాల్సిన మైనారిటీ విద్యాసంస్థ ప్రాథమిక విద్యకు మంగళం పాడుతోంది. ఈ విద్యా సంస్థలో అరాచకం పెట్రేగిపోతోంది. గత కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులపై రాక్షసంగా ప్రవర్తించడంతోపాటు ప్రశ్నించే వ్యవస్థలను చిన్న చూపు చూడడం పరిపాటిగా మారింది.

**విద్యార్థిని చితకబాదారు..**

పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ తమ విద్యాసంస్థనుండే కొనుగోలు చేయాలనే నిబంధనను బలవంతంగా అమలుపరిచే ఈ విద్యా సంస్థ.. కేవలం పాఠ్య పుస్తకాలు లేవనే సాకుతో శుక్రవారం ఓ విద్యార్థిని చితక బాధింది. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన విద్యార్థి తండ్రి ఎవరికి చెప్పుకోలేక, తమ కుమారుడికి జరిగిన అన్యాయాన్ని సహచర ఉపాధ్యాయులతో పంచుకున్నట్లు తెలుస్తోంది. చేతులకు బొబ్బలెక్కేలా పాఠశాల యంత్రాంగం దండించిన తీరు వివాదాస్పదమైంది. ఘటనను విద్యార్థి తండ్రి సహచరులు వైరల్ చేయడంతో.. పాఠశాల నిర్వాకం వెలుగులోకి వచ్చింది.

**ఆది నుండి వివాదాస్పదమే..**

చదువు మాటేమో కానీ, క్రమశిక్షణ పేరుతో కొన్ని సంవత్సరాలుగా ఈ పాఠశాల వివాదాల కౌగిలిలో మగ్గుతోంది. ప్రతి చిన్న అంశాన్ని భూతద్దంలో చూపి, దండించడంలో దిట్టగా అపఖ్యాతి పొందింది. పలు ఘటనల నేపథ్యంలో పాఠశాల యాజమాన్య వ్యవహార శైలిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తప్పు జరిగిన మరుక్షణం క్షమాపణ చెప్పడం, మరల అదే తంతు కొనసాగడం నిత్య కృత్యం. అయినా పొరపాటును సరిదిద్దుకోవడంలో నిర్లక్ష్యం స్పష్టమనే విమర్శ స్థానికంగా జోరందుకుంది.



**విద్యాశాఖ చర్యలు చేపట్టాలి**

ప్రైవేట్ పాఠశాలల్లో “ఫీ” పర్టికులర్స్ నోటీస్ బోర్డుపై బహిరంగపరచాలి. పాఠ్య, నోట్ పుస్తకాలు ప్రైవేట్ విద్యాలయాల్లో బలవంతంగా విక్రయించరాదు. ప్రతి విద్యాలయంలో క్రీడాస్థలం తప్పనిసరి. ఇతర సాంస్కృతిక కళా ప్రదర్శనల పేరిట విచ్చలవిడిగా విద్యార్థుల నుండి వసూలు చేయరాదు. కానీ, పాల్వంచవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాలయాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఆర్థిక దోపిడీ యదేచ్ఛగా జరుగుతోంది. కట్టడి చేయాల్సిన విద్య వ్యవస్థ ప్రేక్షక పాత్రకు పరిమితమవుతోంది.

బాలల హక్కులకు రక్షణేది..

బాలల హక్కులను కాపా డాల్సిన వ్యవస్థలు తమకేం పట్టినట్లు వ్యవహరి స్తున్నాయి. విద్యార్థులపై వరుస ఘటనలు చోటుచేసుకుంటు న్నప్పటికీ.. విద్యాశాఖ చూచి చూడనట్లు వ్యవహరిస్తుంది. ఫిర్యాదు చేస్తే, విద్యాశాఖాధికారులు సర్ది చెప్పడం తప్ప..ఆ యా పాఠశాల యాజమాన్యాలపై చర్యలు తీసుకునే సాహసం చేయడం లేదు. ఏదేమైనా నిబంధనలను పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# రైతులకు రైతు భరోసా ఒక వరం

- డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల
- ఈనెల 30 వ తేదీ నుండి రైతు భరోసా పైకం పంపిణీ
- 30న రైతు సమ్మేళన సభకు ఖమ్మం జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి



**పాల్వంచ, జూన్ 20(మనం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా పథకం తెలంగాణ రైతులకు వరమని రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రైతులకు వానాకాలం సాగు పెట్టుబడి నిమిత్తం 9వేల కోట్ల భారీ బడ్జెట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని ఈనెల 30న ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారని అన్నారు. దీనితో రాష్ట్రంలోని 73 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు ప్రతి ఎకరానికి రూ 6 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించి రైతాంగాన్ని ఆదుకుంటున్నదని కొత్వాల అన్నారు. రైతు భరోసా తో పాటు సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్, వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం మద్దతు ధర వంటి రైతు సంక్షేమ పథకాలు చేపడుతూ రైతాంగాన్ని ఆదుకుంటుందని కొత్వాల అన్నారు.

**సీ.ఎం రేవంత్ రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలి** రైతు భరోసా పథకం ప్రారంభానికి ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం వస్తున్న సీ.ఎం రేవంత్ రెడ్డికి రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని కొత్వాల కోరారు.

# నర్సరీల నిర్వహణ మరింత మెరుగుపరచాలి : డిపిఓ

- మొక్కల సంరక్షణ పై దృష్టి సారించాలి
- పలు పంచాయితీల్లో నర్సరీల సందర్శన

**పాల్వంచ, జూన్ 20(మనం న్యూస్):** నర్సరీలలో మొక్కల నిర్వహణ, సంరక్షణ, పెంపకాన్ని పారదర్శకంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యా చందన అన్నారు. మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం, బసవతారకం కాలనీ, బిక్కుతండా, సోమలగూడెం మరియు లక్ష్మీదేవిపల్లి గ్రామ పంచాయతీలలోని నర్సరీలను శనివారం డిపిఓ సందర్శించారు. నర్సరీలలో మొక్కల నిర్వహణ, వాటి సంరక్షణ, నీటి సరఫరా, మొక్కల పెంపకం తదితర అంశాలను పరిశీలించి, సంబంధిత అధికారులకు సూచనలు అందించారు. నర్సరీల నిర్వహణను మరింత మెరుగుపరచాలని, మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి



సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారీ షేక్ షబ్బ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి

**– అకేనేపల్లి, లింగాలపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్**



**దమ్మపేట, జూన్ 20(మనం న్యూస్) :** జిల్లాలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా దమ్మపేట మండలం ఆకేనేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం దమ్మపేట మండలం లింగాలపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ మరియు రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అకేనేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికాబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు.దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు,సర్వేయర్ నాగరాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కోఆర్డినేటర్ – సైదులు నియామకం ఆక్షేపనీయం

**– పి ఆర్ టి యు టీఎస్ భద్రాద్రి జిల్లా శాఖ**

**పాల్వంచ, జూన్ 20(మనం న్యూస్):**నిబంధనలకు విరుద్ధంగా సైదులు కు "ఆన్ డ్యూటీ" ఉత్తర్వులు ఇవ్వడం జిల్లా విద్యాశాఖ పక్షపాత వైఖరికి నిదర్శనం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖాధికారులు జారీ చేసిన ఆన్ డ్యూటీ ఉత్తర్వులను వెంటనే రద్దుచేసి, అర్హత గల ఇతర ఉపాధ్యాయులను నియమించాలని సంఘ పక్షాన పి ఆర్ టి యు నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు పత్రిక ప్రకటన విడుదల చేశారు. గత 5 సంవత్సరాలు సీఎంఓ గా ఫారెన్ సర్వీస్ పూర్తి చేసుకొని, తిరిగి పాఠశాలకు సర్దుబాటు అయిన ఎస్ కే సైదులు నిబంధనలకు లోబడి దరఖాస్తు చేయకూడదు. ఒకవేళ దరఖాస్తు చేసినప్పటికీ.. పరిగణలోకి తీసుకోకూడదు. కానీ, తిరిగి అతన్నే కో ఆర్డినేటర్ ఐఈ – సీఎంఓ మరియు మీడియా గా ఎంపిక చేస్తూ.. ఆన్ డ్యూటీ ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదు. ఈ ఉత్తర్వులను వెంటనే సవరించి అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి జిల్లా విద్యాశాఖ పై ఉపాధ్యాయులకు ఉన్న నమ్మకాన్ని నిలుపుకోవాలని జిల్లా శాఖ తరపున పి ఆర్ టి యు నేతలు నరసయ్య, ప్రభాకర్ రావులు కోరారు.

# ఎండో మెంట్ ద్వారా గుడి నిర్మాణానికి సహకారం

**ఎర్రుపాలెం, జూన్ 20 (మనం న్యూస్)** మండల పరిధిలో బనిగండ్లపాడు గ్రామంలో హనుమంతుడి గుడి శ్రీకృష్ణుడు గుడి సుమారుగా 50 సంవత్సరాలు నాటి గుడి శిథిల వ్యవస్థలో ఉంది. మండల ఉపాధ్యక్షుడు శీలం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ లో ఉన్నటువంటి పెద్దల సమక్షంలో ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలుసుపాటి జయరాజు సొసైటీ చైర్మన్ శీలం.అక్కిరెడ్డి ఉప సర్పంచ్ వేమిరెడ్డి రామిరెడ్డి.గ్రామ శాఖ అధ్యక్షులు యన్నం పిచ్చిరెడ్డి నరసింహపురం మాజీ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి మాజీ సొసైటీ అధ్యక్షుడు యన్నం.సత్యనారాయణ రెడ్డి. వేమిరెడ్డి వెంకటరెడ్డి యరమల నరసింహారెడ్డి.కోన్నా సత్యంబాబు కర్నాటి శ్రీనివాస్ రెడ్డి.బాణాల శ్రీను యన్నం సుధాకర్ రెడ్డి గూడూరు శ్రీనివాస్ రెడ్డి.మాజీ కృష్ణారెడ్డి మర్రి వంశీకృష్ణ మర్రి గౌతమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు



# బీఎస్పీ మండల అధ్యక్షుడిగా బొడ్డు బాబురావు ఎన్నిక



**నేలకొండపల్లి, జూన్ 20 (మనం న్యూస్) :** బహుజన్ సమాజ్ పార్టీ నేలకొండపల్లి మండల అధ్యక్షుడిగా బొడ్డు బాబురావు ఎన్నిక అయ్యారు. మండలం లోని పైనంపల్లి గ్రామానికి చెందిన బొడ్డు బాబురావు అనేక సేవా కార్యక్రమాలను చేస్తూ పేద ప్రజలకు అండగా నిలిచారు. సెక్టార్ అధ్యక్షుడిగా,మండల ప్రధాన కార్యదర్శి గా అంచెలంచెలుగా ఎదిగిగారు. వారి సేవలను గుర్తించిన జిల్లా పార్టీ మండల అధ్యక్షులుగా నియమించింది. బొడ్డు బాబురావు నియామకం పట్ల నేలకొండపల్లి ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బీఎస్పీ పార్లమెంట్ ఇంచార్జి బుర్ర ఉపేంద్ర సాహు,జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వర్ రావు, రాష్ట్ర నాయకులు పల్లెపొంగు విజయ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల నాగరాజు, ఉపాధ్యక్షుడు రామయ్య, జిల్లా కార్యదర్శులు బి.ఉపేందర్, కారుమంచి నాగరాజు, కోటయ్య, సతీష్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.




# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి

# 23న మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పేటకు రాక!

**– కార్యక్రమం విజయవంతం చేయాలి**

**– బిఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చిన మాజీ ఎమ్మెల్యే తాటి**



**దమ్మపేట, జూన్ 20(మనం న్యూస్) :** ఈనెల 23వ తేదీన మధ్యాహ్నం 2:00 గంటలకు అశ్వారావుపేట పట్టణంలో శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్ నందు పార్టీ సభ్యత్వ నమోదు ఎస్ఐఆర్ (SIR పై) దిశానిర్దేశం చేయనున్న మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు,కావున అశ్వారావుపేట నియోజక వర్గంలోని 184 బూత్ లకు సంబంధించిన BLO లు బీఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని హరీష్ రావు,పర్యటనను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో కోరారు.

# కొత్తపేటలో ఆర్.సి.సి తూరల ఏర్పాటును పర్యవేక్షించిన సర్పంచ్ పగడాల



**దమ్మపేట, జూన్ 20: (మనం న్యూస్) :** దమ్మపేట గ్రామపంచాయతీ 9 వ వార్డు కొత్తపేటలో సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, వార్డు సభ్యులు భవాని కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం రోడ్డు జంక్షన్ల వద్ద మురుగునీరు, వర్షాకాలం దృష్ట్యా వరద నీరు వెళ్లడానికి ఆర్.సి.సి పైపులను జెసిబి సహాయంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటి చేసుకుంటూ, పంచాయతీ పరిధిలో ముఖ్యంగా మౌలిక వసతులు రోడ్డు, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ తదితర ప్రజా సమస్యల పై పాలకవర్గ సభ్యులు అయిన మేము అందరమూ నిరంతరం కృషి చేస్తున్నాము అని తెలియజేశారు. కార్యదర్శి బండి అనంత్ కుమార్, ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, రూపా రాంబాబు, దారా రాము పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి

**–. ప్రజలకు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ సూచనలు**




**కొత్తగూడెం క్రైమ్ , జూన్ 20 : (మనం న్యూస్ )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం వన్‌టౌన్, సీఐ కరుణాకర్ విజ్ఞప్తి చేశారు. వర్షాల కారణంగా రహదారులపై నీరు నిల్వ ఉండటం, లోతట్టు ప్రాంతాల్లో జలమయం కావడం, చెట్లు కూలిపోయే ప్రమాదం ఉండటంతో ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా బయటకు రావద్దని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు శాఖకు సమాచారం అందించి సహాయం పొందాలని సీఐ కరుణాకర్ తెలిపారు. వర్షాల కాలం ముగిసే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబ సభ్యుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మనం



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## లోక్ ఆదాలత్ కార్యక్రమంలో పులిహోర పొట్లాలు పంపిణీ




**భద్రాచలం ,జూన్ 20 (మనం న్యూస్):** భద్రాచలం జ్యుడీషియల్ కోర్టు ఆవరణలో లోక్ ఆదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, కార్యదర్శి పూసాల శ్రీనివాసచారి సభ్యులు పేరాల నాగరాజు ల రిక్వెస్ట్ మేరకు ప్రముఖ సామాజికవేత్త గాదె మాధవరెడ్డి కక్షిదారులకు సుమారు 350 మందికి పులిహోర ప్యాకెట్లను అందించడం చాలా సంతోషకరమని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శివ నాయక్, మేజిస్ట్రేట్ దుర్గ భవాని అడిషనల్ మేజిస్ట్రేట్ రాందాస్ ఇటువంటి సేవా దృక్పథం ఉండటం ఎంతో సంతోషమని మాధవరెడ్డిని అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్ మాట్లాడుతూ మా కోర్టు ఆవరణలో ఇటువంటి కార్యక్రమం ఎప్పుడు జరిగినా మీరు ముందుంటారని, అలాగే రాబోవు రోజుల్లో కూడా మీరు ఎప్పుడూ మాకు సహకరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాల శ్రీనివాసన్ అభిలాషించారు. అలాగే ఈరోజు జరిగినటువంటి పులిహోర ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమానికి గాదె మాధవ రెడ్డి ని శాలువాతో సత్కరించి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు, కచ్చిదారులు,న్యాయవాదులు, అలాగే పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని చాలా పెద్ద మొత్తంలో కేసులు పరిష్కారం చేశారు.

## నకిలీ విత్తనాలు రైతులకు ఇస్తే సహించేది లేదు.

**- బాండు మొక్కజొన్న పేరుతో మోసం చేసిన కంపెనీలను, వ్యాపారుల పై చర్యలు తీసుకోవాలి**

**- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, అఖిల భారత ఐక్య రైతు సంఘం**

**భద్రాచలం, జూన్ 20 (మనం న్యూస్ ):** భద్రాచలం పట్టణం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆఫీసులో ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కే రంగారెడ్డి మాట్లాడుతూ నకిలీ విత్తనాలని రైతులకి ఇచ్చి, ఇబ్బందులకు గురి చేస్తున్న ఫెర్టిలైజర్ షాపులపై, బాండ్ కంపెనీలపై అగ్రికల్చర్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. చర్ల, దుమ్ముగూడెం మండలంలో బాండు మొక్కజొన్న పేరుతో నకిలీ విత్తన కంపెనీలు నకిలీ విత్తనాలు ఆదివాసి రైతులకు, ఇతర పేదలకు అంటగట్టి నిలువున ముంచేస్తున్నారని కంపెనీలను వ్యాపారులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చర్ల మండలంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన 21 మంది ఆదివాసి రైతులను మోసపూరిత మాటలు చెప్పి,బాండు మొక్కజొన్న విత్తనాలు చర్ల లోనే ఒక వ్యాపారి మూడు నుంచి నాలుగు టన్నులు ఎకరానికి దిగుబడి వస్తుందని నమ్మించి, పంట చేపించగా ఒక్క టన్ను కూడా దిగుబడి రాలేదని ఆయన అన్నారు. ఏజెన్సీలో ఆదివాసి చట్టాలు అమల్లో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఇలా చేయడం నేరం అనే ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం తాసిల్దార్, పోలీస్ స్టేషన్ లో కూడా సంబంధిత రైతులు ఫిర్యాదు చేసిన స్పందించకపోవడం అన్యాయమని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నకిలీ విత్తన వ్యాపారుల మరియు కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్టపరిహారం ఇప్పించాలని బహుళ జాతి కంపెనీలను ఏజెన్సీలో నిషేధించాలని దొంగ చాటుగానే బినామీ పేర్లతో నకిలీ విత్తనాలు అమ్మకం సాగిస్తే సహించేదే లేదని ఆయన అన్నారు. లేనియెడల రైతులను సమీకరించి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ జిల్లా నాయకురాలు కే . కల్పన, డివిజన్ నాయకులు దాసరి సాయన్న, మునిగేలా శివ ప్రశాంత్, రమక్క, వెంకటేశ్వర్లు, శాంతక్క తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులలో దాగి వున్న ప్రతిభ నైపుణ్యాలను వెలికి తీయాలి

**- ఐటిడిఏ పిఓ బి రాహుల్**

**- విద్యార్థుల స్థితిగతులను ఎప్పటికప్పుడు గమనించాలి**

**- పిల్లలతో పిల్లాడై క్రికెట్ ఆడిన పిఓ**









**దుమ్ముగూడెం జూన్ 20 (మనం న్యూస్):** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులకు చదువుతోపాటు వారికి ఇష్టమైన కళలు క్రీడల పట్ల మక్కువ కలిగించి వారిలో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను ఇప్పటి నుండే వెలికి తీయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. దుమ్ముగూడెం మండలం ఆర్లగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు తరగతి గదులు లైబ్రరీ , డైనింగ్ హాల్ ,విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పిల్లలకు సరఫరా చేసే పాఠ్యపుస్తకాలు నోట్స్ లు పరిశీలించిన ఆయన మండలంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమం ఎలా జరుగుతుందో ఫోన్లో వీడియో ద్వారా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులకు తమ గ్రామాలకు వెళ్లి తిరిగి పాఠశాలకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు వాతావరణం మార్పు వలన అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉన్నందున విద్యార్థుల మానసిక స్థితిగతులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు గమనించి సకాలంలో వైద్యం చేయించాలని అన్నారు. వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, విషపూరితమైన క్రిమి కీటకాలు సంచరిస్తూ ఉంటాయని రాత్రిపూట విద్యార్థులు బయటకు రాకుండా చూడాలని, ప్రతిరోజు వంటగది శుభ్రం చేసి మెనూ ప్రకారము విద్యార్థులకు వేడిగా ఉన్న ఆహారాన్ని వడ్డించాలని అన్నారు. పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలని, పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిలవకుండా సైడ్ డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం చిన్న ఆర్లగూడెం, కొంగ వాగు గుంపు జిపిఎస్ పాఠశాలలను పరిశీలించి పిల్లల చేత ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేస్తూ ఈ సంవత్సరం ఉద్దీపకం వర్క్ బుక్ లోని అంశాలు మార్పులు చేర్పులు చేయడం జరిగిందని, సంబంధిత ఉపాధ్యాయులు ఉద్దీపకం వర్క్ బుక్ లోని పదాలను పిల్లల చేత బోర్డుపై వ్రాయించి వాటి అర్థాలను వారి చేత చెప్పించాలని అలాగే ప్రతిరోజు బోధించే పాఠ్యాంశాలతో పాటు అదనంగా విద్యార్థులకు వారికి ఇష్టమైన వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయానికి సంబంధించిన కలల పట్ల అవగాహన కలిగించాలని ఉపాధ్యాయులకు సూచిస్తూ వీటితోపాటు క్రీడలపై కూడా మక్కువ కలిగించాలని అన్నారు.

**పిల్లలతో పిల్లాడై క్రికెట్ ఆడిన పిఓ**

శనివారం దుమ్ముగూడెం మండలాన్ని పర్యటించిన భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్ చిన్నారుల గూడెం జిపిఎస్ పాఠశాల సందర్శన సందర్భంగా వివో కొద్దిసేపు చిన్నపిల్లాడి అవతారం ఎత్తారు. పాఠశాల ఆవరణలో కొందరు పిల్లలు క్రికెట్ ఆడుతుండగా పి వో బ్యాట్ తీసుకుని కొద్దిసేపు బ్యాటింగ్ చేసి పిల్లలతో పిల్లాడిగా కలిసిపోయారు. ఈ సందర్భంగా బ్యాటింగ్ కి సంబంధించిన మెలకువలు చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమశేఖర్, వార్డెన్ లక్ష్మణరావు, ఎస్సీ ఆర్ పి విటల్, జిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపారావు, కన్నారావు , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారం



**భద్రాచలం, జూన్ 20 (మనం న్యూస్ ):** భద్రాచలంలోని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు,అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులలో శనివారం జాతీయ న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు, జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించబడింది. మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ , జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్ మాట్లాడుతూ, ప్రజలు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో న్యాయం పొందే అవకాశం కలుగుతుందని ఆయన తెలిపారు. అలాగే అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దుర్గా భవాని ఆధ్వర్యంలో నిర్వహించిన, ఈ లోక్ అదాలత్‌లో రాజీ యోగ్యమైన వివిధ కేసులను పరిశీలించి, పరస్పర అవగాహనతో పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజలకు సత్వర, సులభ,తక్కువ వ్యయంతో న్యాయం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు న్యాయాధికారులు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా కావడంతో పాటు న్యాయ వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. రామదాసు , భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి,లోక్ అదాలత్ సభ్యులు శ్రీ పేరాల వెంకటేశ్వర్లు , ఆవులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు, వివిధ శాఖల అధికారులు హాజరై కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు. జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో -160,బ్యాంకు కేసులు లో 71,77,596(సేవేంటీ వన్ లాక్స్ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో --23కేసులు గాను 49,000/- జరిమానా కేసులు ద్వారా, స్పెషల్ సెకండ్ క్లాస్ కోర్ట్ లో 10,006 కేసులు కి 2,25,050/-జరిమానా ద్వారా పరిష్కారమయ్యాయి.

# పాపం.. 'ఇడమయ్య'...

ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ఆదివాసీ
చచ్చు పడిన చేతులు
భారంగా మారిన బ్రతుకు
కూలి పనులు చేస్తూ భర్తను పోసిస్తున్న భార్య సుశీల
ఆరేల్లుగా ఫించన్ కొరకు ఎదురు చూపులు
పట్టించు కొని అధికారులు, రాజకీయ నాయకులు
నేడు ఆపన్న హస్తం కొరకు ఎదురుచూపులు









**చర్ల, జూన్ 20 (మనం న్యూస్) :** బ్రతుకుదెరువు కొరకు వలస వెళ్లి కూలీ పనులు చేస్తున్న ఇడమయ్య అనుకోని ప్రమాదంలో చిక్కుకొని రెండు కాళ్లను కోల్పోవడమే కాకుండా రెండు చేతులు చచ్చుబడిపోయాయి. దీంతో అతని బ్రతుకు భారంగా మారింది. కట్టుకున్న ఇల్లాలు అన్నీతానై భర్త బరువు బాద్యతలను మోస్తోంది. ప్రమాదం సంభవించి ఆరేల్లయినా అదికారులు, ప్రజాప్రతినిధులు అతనిపై కనికరం చూపలేదు. ఎన్ని మార్లు దివ్యాంగ ఫించన్ కొరకు దరఖాస్తు చేసుకున్నా ఫించన్ మంజూరు కాలేదు. పూట గడవటమే కష్టంగా మారిన నేపథ్యంలో నేడు ఆదుకునే ఆపన్న హస్తం కొరకు అతడు ఎదురు చూస్తున్నాడు.

చర్ల మండలం పులిగుండాల గ్రామ పంచాయతీ బక్కచింతలపాడు గ్రామానికి చెందిన మడకం ఇడమయ్య కూలీ పనులను చేసుకుంటూ జీవనం సాగిస్తుండే వాడు. ఈ క్రమంలో ఆరేల్ల క్రితం పాల్వంచకు చెందిన ఒక కాంట్రాక్టర్ బిల్డింగ్ పనుల నిమిత్తం ఇడమయ్యను కొత్తగూడెం తీసుకువెల్లి పనులను చేయించాడు. ఈ క్రమంలో బిల్డింగ్ కు ఉపయోగించే ఇనుప చువ్వలను అందిస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలను చువ్వ తగలడంతో విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో రెండు కాళ్లను ఇడమయ్య పూర్తిగా కోల్పోయాడు. రెండు చేతులూ చచ్చిబడిపోయి దగ్గరకు వచ్చాయి. దీంతో అతడు ఏ పనులను చేయలేని నిస్సహాయ స్దితికి చేరుకున్నాడు. ఎక్కడకు వెల్లాలన్నా బార్య సుశీలపైనే ఆదారపడుతున్నాడు. భర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ నడవలేని స్దితిలో ఉన్న అతడిని భార్య సుశీల ఎత్తుకు వెల్లి కాలకృత్యాలతో పాటు ఇతర పనులకు సహకారం అందిస్తూ భర్తపై మమకారం చూపుతోంది. దివ్యాగత్వంతో ఏపనిచేయలేని భర్తను భార్య కూలీ పనులతో పాటు అటవీ ఉత్పత్తుల సేకరణ ద్వారా వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో పోషించుకుంటోంది. దివ్యాంగుడుగా మారి ఆరేల్లు గడుస్తున్నా ఇడమయ్యకు నేటి వరకు ప్రభుత్వం ఫించన్ మంజూరు చేయలేదు.

ఈ దిశగా అదికారులు, రాజకీయ నాయకులు ప్రయత్నాలను చేయకపోవడం గమనార్హం. గత ఏడాది కొత్తగూడెం వెల్లిన ఇడమయ్య సదరం సర్టిఫికేట్ పొందాడు. మీ సేవ ద్వారా ఫించన్ కొరకు దరఖాస్తు చేసుకున్నా ప్రభుత్వం కనికరం చూపలేదు. నడవలేని స్దితిలో ఉన్న ఇడమయ్య బార్య సంపాదించే కొద్ది మొత్తం ఆదాయం సరిపోక అవస్దలు పడుతున్నాడు. దాతలు సహకరించి కృత్రిమ కాళ్లు పెట్టించాలని వేడుకొంటుంన్నాడు. దాతలు ఆదుకొని ఆపన్న హస్తం అందించాలని కోరుతున్నాడు. ట్రైసైకిల్ లేదా ట్రై వాహనం అందచేస్తే తన పనులను తాను చేసుకుంటానని వేడుకుంటుంన్నాడు. అదికారులు స్పందించి దివ్యాంగ ఫించన్ మంజూరయ్యేలా కృషిచేయాలని కోరుతున్నాడు.

## ఎంపిడివో ఈదయ్య వివరణ...

ఈ విషయమై ఎంపిడివో కనపర్తి ఈదయ్యను వివరణ కోరగా గత రెండున్నరేల్లుగా ప్రభుత్వం కొత్త ఫించన్లను మంజూరు చేయలేదు. దీనికి తోడు గత ఏడాదే ఇడమయ్యకు సదరం సర్టిఫికేట్ వచ్చినందున ఈ సారి ఫించన్ పొందేలా కృషిచేస్తాము.

# ఉపాధ్యాయునిపై వైద్యుని దాడి

## - పోలీస్ స్టేషన్ లో పరస్పరం ఫిర్యాదు

**చర్ల, జూన్ 20 (మనం న్యూస్) :** వైద్య పరీక్షల కొరకు వచ్చిన గిరిజన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రం మత్తు వైద్యుడు దాడికి దిగిన సంఘటన శనివారం వైద్యశాల ఆవరణలో చోటుచేసుకుంది. చర్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పలక నాగేశ్వరరావు వైద్యం కొరకు శనివారం వైద్యశాలకు వచ్చారు. ద్విచక్ర వాహనం పార్కింగ్ చేస్తుండగా అదే సమయంలో మత్తు వైద్యుడు డాక్టర్ కృష్ణప్రసాద్ కార్ వైద్యశాల ఆవరణకు చేరుకొంది. ఈ క్రమంలో ఉపాద్యాయుడి వాహనం పక్కకు తీయమని చెప్పే క్రమంలో ఇద్దరి మద్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇరువురు దూషించుకోగా ఆగ్రహంతో వైద్యుడు ఉపాద్యాయుడిపై చేయి చేసుకున్నారు. ఈ దాడిలో అక్కడ విదులలో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సైతం వైద్యుడికి మద్దతుగా ఉపాద్యాయుడిపై దాడికి దిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ద్విచక్ర వాహనం పక్కకు తీయమని చెప్పగా ఆగ్రహించిన ఉపాద్యాయుడు వైద్యుడిని పరుష పదజాలంతో దూషించడంతో ఘర్షణ చోటు చేసుకుందని వైద్య వర్గాలు తెలిపాయి. దాడి విషయమై ఇరువురు పరస్పరం పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసుకోగా సిఐ రాజువర్మ విచారిస్తున్నారు. కాగా ఉపాద్యాయుడిపై దాడిని ఉపాద్యాయ, గిరిజన సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడికిపాల్పడిన వైద్యునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసాయి. కాగా ఈ విషయమై జిల్లా ఆసుపత్రుల సమన్వయ అదికారి డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ దాడి విషయమై విచారణ చేసి బాద్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మనం



# చర్ల

చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం



## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### - ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరుస్తాం - కనీస మౌళిక వసతులపై దృష్టి

### రూ.1.73 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

**చర్ల, జూన్ 20(మనం న్యూస్) :** ప్రజా సంక్షేమమే ద్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఇందులో బాగంగా చర్ల మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యమని భద్రాచకం ఎమ్మెల్యే డా తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం చర్ల మండలంలోని దేవరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రూ.1 కోటి 73 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామాలలో రహదారుల నిర్మాణం పూర్తయితే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సైతం సులభతరం అవుతుందని తెలిపారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన అనేక గ్రామాల్లో ప్రస్తుతం అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దేవరపల్లి పంచాయతీ ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న రోడ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని, పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అదికారి కనపర్తి ఈదయ్య, పంచాయతీ రాజ్ ఏఈ వాసుదేవరావు, జిల్లా కాంగ్ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీకృష్ణ, చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ నాయుడు, లంక రాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలను సద్వినియోగం చేసుకోండి

### - మండల విద్యాశాఖ అధికారి పరిటాల

**చర్ల, జూన్ 20 (మనం న్యూస్) :** ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలలను తల్లిదండ్రులు సద్వినియోగ పరుచుకోవాలని మండల విద్యాశాఖ అదికారి పరిటాల వెంకటరమణ విజ్ఞప్తి చేసారు. శనివారం రైస్ పేట కాలని ప్రాదమిక పాఠశాలలో ప్రీప్రైమరీ సెక్షన్ ను ఎంఈవో ప్రారంబించారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల



కమిటీ సమావేశం చైర్ పర్సన్ పి లలిత అద్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటరమణ మాట్లాడుతూ ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు ఉపాద్యాయురాలు, సహాయకురాలి పోస్ట్ కొరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్దులను స్దానికత, మెరిట్ ఆదారంగా ఏఏపిసి చైర్ పర్సన్, సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. ప్రీప్రైమరీ పాఠశాలలో 3,4 సంవత్సరాల వయసుగల పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్దులకు ఉచితంగా పలకలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలను ప్రభుత్వం అందచేస్తోందని తెలిపారు. దీనికి తోడు ప్రతిరోజూ పుష్టికరమైన ఆహారాన్ని అందిస్తున్నందున తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లాలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రదానోపాద్యాయుడు బత్తుల శ్రీనివాసరావు, ఉపాద్యాయులు పి అరుణ, కే స్వప్న, స్వచ్ఛ మిత్రలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనం



# పినపాక



## కుక్క దాడి.. చిన్నారికి గాయాలు...



**ఆళ్లపల్లి, జూన్ 20 (మనం న్యూస్):** కుక్క కాటుతో ఓ చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని మారుమూల ఏజెన్సీ గ్రామమైన అడవిరామారం గ్రామానికి చెందిన పోడియం మంజుల అనే 12 ఏళ్ల బాలికపై శుక్రవారం రాత్రి సమయంలో ఓ కుక్క దాడి చేయడంతో ఆ బాలికతో తీవ్రంగా గాయపడింది. ఆ గ్రామానికి నూతనంగా రహదారి రహదారి పనులు చేపడుతున్నప్పటికీ ఆ రహదారి పనులు పూర్తి కాకపోవడంతో అందులోనూ రాత్రి సమయంలో భారీ వర్షం కురవడంతో ఆ బాలికను శుక్రవారం ప్రభుత్వం వైద్యశాలకు తీసుకురావడం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది ఆ బాలికకు చికిత్స అందించి తగు జాగ్రత్తలు సూచించారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



**కరకగూడెం, జూన్ 20(మనం న్యూస్):** కరకగూడెం మండలం బట్టుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. పాఠశాలలో ఆంగ్లం, నర్సింగ్ బోధించేందుకు ఒక సంవత్సరం కాలపరిమితితో 2026 నుంచి 2027 ఏప్రిల్ పరీక్షల వరకు పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులై ఉండాలని, తమ అసలు ధ్రువపత్రాలతో ఈ నెల 29వ తేదీ సాయంత్రం 4:30 గంటలలోపు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సమర్పించాలని కోరారు. అభ్యర్థుల ఎంపికను అర్హత, ప్రతిభ ఆధారంగా జిల్లా కమిటీ చేపడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీదేవి కోరారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

**- పలు కేసులు రాజీ.. - నేరం అంగీకరించిన కేసుల్లో జరిమానాలు..**




**మణుగూరు, జూన్ 20(మనం న్యూస్):** జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో భారీ స్థాయిలో పెండింగ్ కేసుల పరిష్కారం జరిగింది. వివిధ రకాల కేసుల్లో రాజీ, నేర అంగీకారం, జరిమానాల ద్వారా గణనీయ సంఖ్యలో కేసులు పరిష్కారమై, కక్షిదారులకు సమయం, ధన వ్యయం తగ్గడంతో పాటు న్యాయస్థానాలపై ఉన్న భారం కూడా తగ్గిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కేసులను పరస్పర రాజీతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు. దీనివల్ల కక్షిదారులకు న్యాయస్థానాల చుట్టూ తిరిగే అవసరం తగ్గుతుంది. సమయం, ఆర్థిక భారం రెండూ తగ్గడమే కాకుండా, దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సఖ్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు.

**పలు కేసుల్లో రాజీ..**

మణుగూరు న్యాయస్థానం పరిధిలో పోలీసు, చెక్కు బాకీ, భరణం, గృహ హింస, మద్యం నిషేధ శాఖలకు సంబంధించిన మొత్తం 2,199 కేసులు పెండింగ్‌లో ఉండగా, జాతీయ లోక్ అదాలత్ ద్వారా 147 కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో 94 పోలీసు కేసులు, 2 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారం కాగా, అందులో 42 పోలీసు కేసులు పరస్పర రాజీ ద్వారా ముగిశాయి. మిగిలిన 52 కేసుల్లో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం మొత్తం రూ. 1,15,000 జరిమానా విధించి కేసులను కొట్టివేసింది. మిగతా రెండు షేక్ బౌన్స్ కేసులు ఇరుపక్షాలు రాజీ కుదుర్చుకున్నారు. అలాగే పెట్టి కేసులు 385 పరిష్కారమై రూ.2,16,000 జరిమానా వసూలు చేయగా, ఈ-పెట్టి కేసులు 213 పరిష్కారమై రూ.24,700 జరిమానా విధించారు. ఇక బ్యాంకుల ముందస్తు వివాద పరిష్కారానికి సంబంధించిన 55 కేసులు పరిష్కారమవగా, సంబంధిత బాకీదారులు మొత్తం రూ.30,27,800 చెల్లించడంతో కేసులు ముగిశాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ మధు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాదులు సంధ్య, నాగార్జున్ రెడ్డి, సర్వేశ్వరరావు, రాము, న్యాయస్థాన సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత కక్షిదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో చేతి పంపు ఏర్పాటు...





**ఆళ్లపల్లి, జూన్ 20 (మనం న్యూస్):** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో శనివారం చేతిపంపు ఏర్పాటు చేయడం జరిగిందని సర్పంచ్ వాసం సుష్మిత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో చేతు పంపు లేక వైద్యశాలకు వచ్చే రోగులు నీటి కొరకు ఇబ్బందులు పడుతున్నారని గత పర్యటనలో భాగంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆయన బోర్ వేయించడం జరిగిందనారు. సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకువెళ్తే ఆ సమస్యను వెంటనే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేకు వైద్య సిబ్బందితో పాటు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ కో ప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, ప్రముఖ వ్యాపారస్తులు గౌరిశెట్టి శ్రీనివాసరావు, రామానుజ గూడెం సర్పంచ్ మోకాళ్ళ చంద్రశేఖర్, మహిళా నాయకులు పానుగంటి మంగ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలగాని శ్రీను, వళ్ళల నాగం, గోగేల కాంతు, కుంట వెంకటరాములు, వార్డు సభ్యులు గౌరబోయిన సీత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దోసపాటి వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం



**మణుగూరు, జూన్ 20(మనం న్యూస్):** తిరుమల తిరుమతి దేవస్థానం వెంకటేశ్వర స్వామి సన్నిధిలో నిర్మించనున్న తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్ గా ఎన్నికైన సందర్భంగా ఎస్ కే టి గ్రూప్ చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావును ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శనివారంగుట్టమల్లారంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ మణుగూరులో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్నో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఉచితంగా అంతిమ రథ యాత్ర, పుర ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు బల్లలు ఏర్పాటుతో పాటు మండలంలోని ప్రముఖ ఆలయాలకు ప్రధాన దాతగా ఉన్న దోసపాటి వెంకటేశ్వరరావుకు అవకాశం రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రోచ్ఛరణతో ఆశీర్వచనాలు అందించగా, పుర ప్రముఖులు, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ నాయకులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడవెండి విశ్వనాథగుప్తా, దుగ్గి సతీష్, దోసపాటి నాగేశ్వరరావు, చిత్తలూరి రమేష్ బాబు, కత్తి రాము, బండారు నర్సింహారావు, చిట్టూరి శేషుకుమార్, బొగ్గవరపు మురహరి, మురళి, సంకా రాధాశ్యాం గుప్తా, సంకా శ్రీనివాసరావు, కందుకూరి సుబ్బారావు, బొడ్డు పుల్లారావు, వడియాల ప్రభాకరరావు, దింటకుర్తి బ్రహ్మయ్య, సుగ్గల భాను సంతోష్, సుగ్గల సూర్యం, కోటగిరి సందీప్, బచ్చు స్వరాజ్యరావు, వాసు, నరేందర్. కంకణాల వెంకటేశ్వరరావు, వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి శ్యామ్, కొల్లూరి గౌరీ శంకర్, శ్రీరామ్ రాము, డాక్టర్ సమ్మయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

## రైతు పండించిన పంటను రాష్ట్ర ప్రభుత్వం కొనాల్సిందే

**- మండల బిఆర్ఎస్ నాయకులు**



**మణుగూరు, జూన్ 20(మనం న్యూస్):** మణుగూరు పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మణుగూరు టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు,పట్టణ అధ్యక్షులు కుంట లక్ష్మణ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అధికారంలోకి రావడం కొరకు అమలు కానటువంటి అడ్డగోలు హామీలు ఎడాపెడ ఇస్తూ ఎన్నో బహిరంగ సభల్లో రైతులను ఆదుకుంటాం రైతులకు అది చేస్తాం ఇది చేస్తాం కెసిఆర్ రైతుబంధు రెండు ధపాలే వేస్తున్నాడు మరి మూడోదఫా ఎవడు ఏస్తాడు అదే మేము వచ్చిన తర్వాత మూడో దాబా కూడా రైతుబంధు చేస్తామని ప్రాపకల్పాలు పలికినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పుడు పదవి ఎక్కిన తర్వాత మొన్న జరిగినటువంటి యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు తీవ్రమైన అన్యాయం చేసి సమయానికి ధాన్యాన్ని కాటాలు పెట్టకుండా లారీలు పంపించి ఎత్తకుండా చాలా ఇబ్బందులకు గురి చేసినటువంటి సందర్భం తెలంగాణ రాష్ట్ర రైతాంగం మొత్తం చూశారు ఒకవేళ కాట పెట్టి లారీలో ధాన్యం ఎత్తి మిల్లు దగ్గరికి ధాన్యం వెళితే మిల్లర్ పెట్టే అటువంటి ఇబ్బందులు చిత్రహింసలకు రైతులు ఆ యొక్క ధాన్యం బస్తాల మీదనే ప్రాణాలు వదిలినటువంటి పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కోకోనలుగా చూసాం.కావున నిన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రం ఆదేశాల ప్రకారమే ధాన్యం కొంటామని చెప్పడం శోచనీయంగా ఉంది అన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని రైతులకు ఎన్నికల ముందల ఇచ్చినటువంటి మేనిఫెస్టోలో ఏదైతే ఉపయోగమైనటువంటి విషయాలు పెట్టారు వాటిని తక్షణమే అమలు చేయకపోతే టిఆర్ఎస్ పార్టీ నుండి తీవ్రమైనటువంటి పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, ముత్యం బాబు, వట్టంరాంబాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, తడికమల ప్రభుదాస్, వేల్పుల సురేష్, జావిద్ పాషా, తురక రామకోటి, వడ్లూరి రాంబాబు, వనమాల రాంబాబు, రావులపల్లి వెంకటేశ్వర్లు, బోసెట్టి రవి,గుర్రం సృజన్, జక్కం రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

## నీట్ అభ్యర్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం : ఆర్టీసీ డిఎం శ్యాంసుందర్



**మణుగూరు, జూన్ 20(మనం న్యూస్):** నేడు జరిగే నీట్ యూజీ రీఎగ్జామినేషన్ కు హాజరయ్యే అభ్యర్థులకు నాన్ ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు మణుగూరు ఆర్టీసీ డిఎం శ్యాంసుందర్ తెలిపారు . ప్రభుత్వ ఆదేశానుసారం, ఆర్టీసీ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పరీక్ష జరగనుండగా హాల్ టికెట్ చూపించి విద్యార్థులుఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ప్రెస్, పల్లె వెలుగు ఏ బస్సుల్లో అయినా రేపు మొత్తం ఉచితంగా ప్రయాణించవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రతీ ఎకరాకి సాగు నీరు అందించడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

### – పినపాక శాసన సభ్యులు పాయం



**గుండాల,జూన్ 20(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం గుండాల మండల పర్యటన లో భాగంగా పడుగోనిగూడెం గ్రామ పంచాయతీ సమీపంలోని కిన్నెరసాని వాగు పై నిర్మించిన చెక్ డ్యామ్ నీటితో నిండి కళకళలాడటం చూసి పినపాక నియోజకవర్గం శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా వారు గంగమ్మ తల్లి కి చీర పువ్వులు అర్పించి ప్రతీ ఎకరం నీటితో తడవాలని రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని తెలియ చేశారు రైతులు కూడా సబ్సిడీ లు,బోనస్ లు వచ్చే సన్న రకాల బియ్యం విత్తనాలు తెలుసుకుని పండించాలని తద్వారా ప్రభుత్వం అందజేసే పథకాలను పొందాలని అందుకు తగిన విధంగా వ్యవసాయ అధికారులు కూడా రైతులకు అవగాహన కల్పించాలనిఆదేశించారుఅలాగే మండలం లో ఎక్కడ సాగునీటి లోపం ఉన్నా నాదృష్టికి తీసుకు రండి వెంటనే అధికారులతో సర్వే చేపించి అవసరం అయిన చోట అణువయిన చోట చెక్ డ్యాములు నిర్మించడానికి నిధులు మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు

# యూరియా ఎరువు తీసుకునే రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు...

### – ఫార్మా రిజిస్ట్రేషన్ తప్పనిసరి..కరకగూడెం వ్యవసాయ శాఖ అధికారి చటర్జీ



**కరకగూడెం,జూన్ 20(మనం న్యూస్):** కరకగూడెం మండలంలోని రైతులు యూరియా ఎరువు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా కొన్ని నిబంధనలు పాటించాలని కరకగూడెం వ్యవసాయ శాఖ అధికారి చటర్జీ తెలిపారు.ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ఐడి తప్పనిసరిగా ఉండాలని, ఆధార్ నెంబర్ ద్వారా తమ ఫార్మర్ ఐడి ను సంబంధిత లింక్ ద్వారా చెక్ చేసుకోవచ్చని సూచించారు. అలాగే పంటకు సంబంధించిన విత్తనాలు కొనుగోలు చేసిన రసీదు (బిల్) రైతులు వెంట తీసుకురావాలని తెలిపారు.యూరియా ఎరువు నిరంతరం అందుబాటులో ఉంటుందని, రైతులు అవసరానికి మించి కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని ఆయన కోరారు. ప్రతి రైతుకు అవసరమైన మేరకు ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.రైతులు ఎరువుల వినియోగంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటల సాగులో ముందుకు సాగాలని చటర్జీ తెలిపారు.

## రైతు వేదికలో కల్యాణ లక్ష్మి సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**గుండాల,జూన్20(మనం న్యూస్):** గుండాల రైతు వేదికలో జరిగిన పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కల్యాణ లక్ష్మి చెక్కులు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ నిర్వహించారు అనంతరం పాయం మాట్లాడుతూ రాష్ట్రంలో నియోజకవర్గంలో ఏ ఇంట్లో ఆడబిడ్డ పుట్టిన దిగులు చెందాల్సిన అవసరం లేదని ప్రతి బిడ్డకు మన ప్రభుత్వం అండగా ఉంటుందని అందులో భాగంగా ఈరోజు కొత్తగా పెళ్లిళ్లు చేసుకున్న ఆడబిడ్డలకు మన ప్రభుత్వం కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ద్వారా ఒక్క లక్ష పదహార్ వేల రూపాయలు ఆడ బిడ్డలకు అందజేస్తు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సంగీత ఎంపీడీవో బాలరాజు సిఐ తిరుపతి వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు



# విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత

### – గుండాలలో సమగ్ర విద్యా సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**గుండాల,జూన్ 20(మనం న్యూస్):** గుండాల మండలంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు విద్యాశాఖ అధికారులతో ప్రభుత్వ ప్రాథమిక,ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్థానిక జూనియర్ కళాశాలల ప్రతినిధులతో సమగ్ర విద్యా సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో గత రెండు సంవత్సరాల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల ఖాళీలు,విద్యార్థుల నమోదు, పాఠశాలల మౌలిక సదుపాయాలు,భవనాల పరిస్థితి,తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు,ఫర్నిచర్, విద్యుత్ సదుపాయాలు, డిజిటల్ విద్యా వనరులు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలు,కళాశాలలను బలోపేతం చేయడంతో పాటు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న అవసరాలను అధికారులు నిర్భయంగా నివేదించాలని సూచించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులు తమ విద్యాసంస్థల అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి ప్రతిపాదనలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు సమస్యలను పరిశీలించి అమలయ్యే విధంగా అన్ని శాఖలు పనిచేస్తాయన్నారు ఈ సమావేశంలో మండల విద్యాధికారి, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# చాట్ల వనజ కుటుంబాన్ని పరామర్శించిన ఎంఎల్ఏ



**గుండాల,జూన్20(మనం న్యూస్):** 13-06-2026 రోజున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం గుండాల మండల పరిధిలోని శంబునిగూడెం గ్రామ పంచాయతీ చెందిన చాట్ల వనజ ఆకస్మిక మరణం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఈరోజు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతూ ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు ఈ ఘటనపై ముఖ్యమంత్రి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తో మాట్లాడి బాధిత కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు ఎమ్మెల్యే కోటాలో బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు.చాట్ల వనిజ మరణానికి సంబంధించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు అనంతరం గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకుని సంబంధిత వైద్యధికరితో మాట్లాడి వివరణ తీసుకున్నారు అలాగే విచారణ కమిటీ ద్వారా జరిగిన విషయం ఆరా తీసి ఎవరి తప్పిదమైన క్షమించేది లేదని నా నియోజకవర్గ ప్రజల శ్రేయస్సే తనకు ముఖ్యం అని పేర్కొన్నారు అలాగే శిశు సంరక్షణ చైర్మన్ రాష్ట్ర వైద్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుధీరా ని కలిసి పినపాక నియోజకవర్గం లో గుండాల మండలం అతి గ్రామీణ ప్రాంతం అని ఇక్కడి పిహెచ్సి లో సిబ్బంది కొరత గురుంచి,అధికారం లోకి రాగానే 108 వాహనం అందుబాటులోకి తెచ్చిన అది లేకపోవడం గురించి వివరించి వెంటనే ఈ పీ హెచ్ సి అభివృద్ధి పరచాలని అలాగే ఇద్దరు ఎంబిబి ఎస్ లతో పాటు ఒక గైనకాలజిస్ట్ కేటాయించాలని కోరడం జరిగింది అలాగే 30 పడకల హాస్పిటల్ గా మార్చి సరైన సదుపాయాలు కల్పించాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమం లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పొంబోయిన ముత్తయ్య ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి ఎస్.కెఖధీర్, ఏఎంసి డైరెక్టర్ ఊకె బుచ్చయ్య , యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దార అశోక్ ,శంబునిగూడెం గ్రామ సర్పంచ్ ఈసం సుమలత, సాయనపల్లి సర్పంచ్ కల్తీ కృష్ణవేణి, రోళ్లగడ్డ సర్పంచ్ భూక్య శ్రీను, మండల నాయకులు వాంకుడోత్ బీకోజీ, ఎస్.కె అబ్దుల్ నభి, ఎస్.కె కాసీం, ఎస్.కె వాజీద్ పాషా, ఎస్.కె ఇస్రార్, బొంగు చంద్రశేఖర్, సోషల్ మీడియా నాయకులు మండలోజు కిరణ్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు


# చెట్టును ఢీకొన్న ఇసుక లారీ

### --ప్రమాదంలో చిక్కుకున్న డ్రైవర్‌కు ఎమ్మెల్యే సమయస్ఫూర్తితో రెస్క్యూ చర్యలు



**అశ్వాపురం, జూన్ 20 (మనం న్యూస్) :** మండలం పరిధిలోని మొండికుంట పాలవాగు వద్ద శనివారం ఉదయం ఇసుక లారీ చెట్టును ఢీకొన్న ప్రమాదంలో క్యాబిన్‌లో ఇరుక్కుపోయి తీవ్ర అవస్థలు పడుతున్న డ్రైవర్‌ను రక్షించేందుకు పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు సమయస్ఫూర్తితో స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.అటుగా ప్రయాణ ిస్తున్న ఎమ్మెల్యే ప్రమాదాన్ని గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపి పరిస్థితిని పరిశీలించారు. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ చిక్కుకుపోయి బయటకు రాలేని పరిస్థితిలో ఉండటాన్ని గుర్తించిన ఎమ్మెల్యే వెంటనే ఐటీసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక రెస్క్యూ బృందాన్ని ఘటనాస్థలికి పంపించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే సూచనల మేరకు ఐటీసీ రెస్క్యూ బృందం అత్యవసర పరికరాలతో వేగంగా ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టింది. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను సురక్షితంగా బయటకు తీసేందుకు చర్యలు చేపట్టడంతో పాటు బాధితుడికి తక్షణ వైద్య సహాయం అందేలా ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యే మానవతా దృక్పథాన్ని, సమయస్ఫూర్తిని అభినందించారు. ప్రమాద సమయంలో వెంటనే స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యే సేవా తత్వాన్ని కొనియాడారు.ప్రజల ప్రాణాలు అత్యంత విలువైనవని, అత్యవసర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతతో స్పందించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి

## కొమరారం గ్రామాన్ని నూతన మండల కేంద్రం గా ప్రకటించండి.

**- కాంగ్రెస్ పార్టీ ఏన్నికలలో ఇచ్చిన మాట నిలబెట్టుకోండి**
**- హైదరాబాద్ లో మంత్రి దామోదర రాజనరసింహని కలిసి వినతిపత్రం ఇచ్చిన కొమరారం మండల సాధన కమిటీ కన్వీనర్ మోతిలాల్**
**- మండల ఏర్పాటు పై సానుకూలంగా స్పందించిన మంత్రివర్యులు దామోదర రాజనరసింహ**



**ఇల్లందు, జూన్ 20 (మనం న్యూస్) :** కొమరారం గ్రామాన్ని మండల కేంద్రం గా ప్రకటించాలని, ఎన్నికల లో కాంగ్రెస్ ఇచ్చిన మాట ను నిలబెట్టుకొని చిత్తశుద్ధిని చాటుకోవాలని కొమరారం మండల సాధన కమిటీ కన్వీనర్ వాంకుడు మోతిలాల్ కోరారు. శనివారం హైదరాబాద్ లోని మంత్రి క్వార్టర్స్ వద్ద కొమరారం మండల సాధన కమిటీ కన్వీనర్ వాంకుడోతూ మోతిలాల్, తెలంగాణ మాజీ డిప్యూటీ మంత్రి, ప్రస్తుత వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు దామోదరా రాజనరసింహ, ని కలిసి వినతిపత్రం ఇచ్చారు.కొమరారం మండల ఏర్పాటు వలన ప్రజలకు మేలు జరుగుతుంది అని, పరిపాలన సౌలభ్యం గా ఉంటుంది అని, ప్రజా పాలన ప్రజలకు దగ్గర గా ఉంటుంది అని, ప్రజలకి దురాభారం తగ్గుతుంది అని, ఇల్లందు మండలం విస్తీర్ణం పరంగా చాలా పెద్దదిగా ఉన్నది అని, తహసీల్దార్, పైన పని బారం ఎక్కువ అయింది అని రైతులకు, విద్యార్థులు సకాలం లో సర్టిఫికెట్ లు అందక చాలా ఇబ్బందు లు పడుతున్నారు అని, ఎన్నికల లో ఎంఎల్ఏ కోరం కనకయ్య, మాట ఇచ్చారు అని, సర్వే కూడా చేసారని, కానీ గెలిచిన తరువాత స్థానిక ధాని గురించి మాట్లాటం కూడా మర్చిపోయా రూపాయలు అని, ఇప్పటి కైనా ప్రభుత్వం ఆలోచించి కొమరారం గ్రామాన్ని నూతన మండలం గా ప్రకటించాలని లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమం చేస్తామని, మండలం ప్రకటించేంత వరకు దశల ఉద్యమం చేస్తామని తెలిపారు. ఈ విషయం పై మంత్రివర్యులు దామోదరా రాజా నరసింహ సానుకూలంగా స్పందించారు, అని మోతిలాల్ తెలిపారు.

## అంగన్వాడీ టీచర్లకు బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలి

**- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గోనే మణి**

**టేకులపల్లి, జూన్ 20:(మనం న్యూస్ ) :** అంగన్వాడీ కేంద్రాలను మూసివేసి అంగన్వాడీ టీచర్లను ఎన్నికల విధుల్లో భాగంగా బిఎల్ఓలుగా నియమించడం వల్ల తల్లులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షులు గోనే మణి ఆవేదన వ్యక్తం చేశారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన సేవలు అంతరాయం కలుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక అదనపు పనులతో అంగన్వాడీ టీచర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల అధికారులు తక్షణమే అంగన్వాడీ టీచర్లను బిఎల్ఓ విధుల నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. అలాగే అంగన్వాడీ సిబ్బందికి సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ముఖ్యమంత్రి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన రూ.18 వేల కనీస వేతనం హామీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు జి. రాంచందర్, ఇందిరా, సంధ్య, విజయలక్ష్మి, నాగమణి, మమత, విమల, శివకుమారి, పి. సుజాత, నీరజ, కౌసల్య, వై. రాజేశ్వరి, పూర్ణ, సుగుణ, సునీతఏ ఐ టి యు సి జిలా కార్యదర్శి నరాటి.ప్రసాద్ తదితరులు. పాల్గొన్నారు.



## దళారి వ్యవస్థను ప్రోత్సహిస్తూ రైతన్న నడ్డి విరుస్తున్న కాంగ్రెస్..!

**- ధాన్యం కొనుగోలు యూరియా సరఫరా లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం...!**
**- రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను పక్కకు నెట్టి, రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం...!**
**- మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్...!**

**ఇల్లందు, జూన్ 20 (మనం న్యూస్) :** భారత రాష్ట్ర సమితి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి కార్యాలయం లో ఇల్లందు మాజీ శాసనసభ్యులు ు నియోజకవర్గ ఇంఛార్జ్, బానోత్.హరిప్రియ నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, భారత రాష్ట్ర సమితి పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ పార్టీ విధి విధానాలపై మండిపడ్డారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయ రంగంపై పూర్తిగా చేతులెత్తేస్తూ కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ పత్రికా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు...ఈ సందర్భంగా ఇల్లందు మాజీ శాసనసభ్యులు ు నియోజకవర్గ ఇంఛార్జ్ బానోత్ హరిప్రియ నాయక్, పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.... ఆనాడు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, పాలనలో పండుగలా సాగిన వ్యవసాయం నేడు రైతన్న పాలిట శాపంగా మారిందని, ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన ధాన్యం వరకే కొనుగోలు చేస్తాము అని అంటే మరి రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం కదా రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేలా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరు దేనికి నిదర్శనం అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం అనేది రైతుల పాలిట శాపం గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన ధాన్యాన్ని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతన్నలు పండించిన మిగతా ధాన్యాన్ని ఎవరు కొనుగోలు చేయాలని ప్రశ్నించారు..!? కేసీఆర్, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతన్న పండించిన చివరి గింజ వరకు కూడా కొనుగోలు చేశారని గుర్తు చేశారు.రాష్ట్రానికి, రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా వ్యవహరించాలి అని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్, రైతుబంధు పేరుతో 75 వేల కోట్లు రూపాయలను రైతుల రైతుల ఖాతాలో జమ చేసిన గొప్ప నాయకుడు అని,మిషన్ కాకతీయ ద్వారా 45 వేల చెరువులను పూడిక తీసిన ఘనత కేసిఆర్, దని గుర్తు చేసుకున్నారు.అంతేకాకుండా రైతులు అకాల మరణానికి గురైతే ఐదు లక్షల రైతు బీమా అని అందిస్తే నేడు రేవంత్ రెడ్డి, ప్రభుత్వం రైతు బీమా క్లెయిమ్, లకు కూడా చెల్లించని దౌర్భాగ్య స్థితిలో ఉండడమే కాకుండా రైతు పండించిన ప్రతి గింజను చిట్టచివరి వరకు కెసిఆర్, ప్రభుత్వంలో ఉన్నప్పుడు కొనుగోలు చేస్తే, నేడు కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఏ ధాన్యమైతే కొనమని చెబుతుందో అంతవరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయమని చెప్పడంతో రైతులు దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతు న్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన తర్వాత నుంచి రాష్ట్రంలో దళారీ వ్యవస్థ పెరిగిపోతుందని ఈ దళారీ వ్యవస్థ ద్వారా రైతన్న తీవ్రంగానష్టపోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో కరోనాలాంటికష్టకాలంలోకూడాముఖ్యమంత్రిగా కేసీఆర్, ఉన్నప్పుడు



7000 కొనుగోలు కేంద్రాలు పెట్టి రైతన్నల పండించిన పంటను కొనడం జరిగిందని నేడు కరోనా లాంటి పరిస్థితి లేకపోయినా కూడా రాష్ట్రంలో రైతన్న పండించిన ధాన్యాన్ని కూడా కొనలేని దౌర్భాగ్యస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వంఉందనిదుయ్యబట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో రాష్ట్రరైతాంగంపూర్తిగానష్టపోతుందని, రైతుల సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు అమలు చేస్తున్న తీరు పట్ల భారీ వ్యత్యాసం ఉందని ఘాటుగా విమర్శించారు. రైతు బంధును ఎకరాకు 15 వేల రూపాయలు పెంచుతామని హామీ ఇచ్చి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు సార్లు వాయిదా వేసి రైతులను మోసం చేశారని రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నను పూర్తిగా విస్మరిస్తుందని రాష్ట్ర రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని మాటలతో గారడి చేష్టలతో కాలం గడుపుతూ రాష్ట్ర రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురి చేస్తుందని రైతుల సంక్షేమం అంటే కేవలం హామీలు కాదు అని సమయానికి అమలు చేయడమే నిజమైన పాలనకు నిదర్శనం అని ఎందుకు విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు భారీ ఉద్యమాలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్నినిలదీస్తామని డిమాండ్, చేశారు..ఈకార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి నాయకులు సిలివేరి పిఎసిఎస్, చైర్మన్ లక్కినేనీ.సురేందర్, జిల్లా నాయకులు భూక్య ధల్ సింగ్ నాయక్, మాజీ టౌన్ అధ్యక్షులు అబ్దుల్ జబ్బర్,మాజీ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ మాజీ మండల అధ్యక్షులు శీలం.రమేష్, టేకులపల్లి మాజీ బొమ్మర్ల వరప్రసాద్ గౌడ్, మండల అధ్యక్షులుమాజీ వైస్ ఎంపీపీ దాస్యం.ప్రమోద్ మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ భావ్ సింగ్ నాయక్, ఉద్యమ నాయకులు దేవిలాల్ నాయక్, టీబీజీకేఎస్, మాజీ జనరల్ సెక్రెటరీ రంగనాథ్, మాజీ మహిళా ప్రెసిడెంట్ నెమలి ధనలక్ష్మి, మాజీ కౌన్సిలర్ తోటలలిత శారద, పట్టణ మాజీ ఉపాధ్యక్షురాలునారా యణమ్మ, ఇల్లందు నియోజక వర్గ యువజన విభాగం, గిన్నారపు రాజేష్, కాసాని హరిప్రసాద్ యాదవ్, సత్తాల.హరికృష్ణ, నీలం.రాజశేఖర్, ఎస్.కె. చాంద్ పాష, బిపిన్ నాయక్, పాబోలు.కిరణ్, ఎస్.కె. పాష, మూలగుండ్ల ఉపేందర్ రావు,సనా రాజేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## కూరగాయల మార్కెట్ను యధావిధిగా కొనసాగించాలి

**- ఈ విషయంపై సంబంధిత వార్డు కౌన్సిలర్లు స్పందించాలి**
**- మున్సిపల్ అధికారుల అత్యుత్సాహం తగ్గించుకోవాలి**
**- గోవింద్ సెంటర్ కూరగాయల మార్కెట్ వ్యాపారుల ఆవేదన**



**ఇల్లందు, జూన్ 20 (మనం న్యూస్):** గోవింద్ సెంటర్లోని కూరగాయల షాపులను మోడల్ మార్కెట్లోకి తరలించేందుకు రంగం సిద్ధం చేసిన మున్సిపల్ అధికారులు, కరోనా సమయం నుండి ఇప్పటివరకు చుట్టుపక్కల ప్రజలకు కూరగాయలు అందిస్తూ వస్తున్నారు .కానీ మున్సిపల్ అధికారులు అక్కడి నుండి షాపులు ఎత్తేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. నాలుగు సంవత్సరాలుగా అందరికీ అందుబాటులో ఉన్న కూరగాయలను, దూరంగున్న మోడల్ మార్కెట్లకు తరలించడం వల్ల చుట్టు పక్కన ప్రజలకు ఇబ్బందులు తప్పవు, ఈ విషయం పైన స్థానిక కౌన్సిలర్లు స్పందించాలని వ్యాపారులు పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కూరగాయల మార్కెట్ ను ఈ ప్రాంతంలో నుండి తరలించి ప్రభుత్వ స్థలం ఎవరికి కట్టబెట్టడానికి మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు అర్థం కావటం లేదని ప్రజలు నిందిస్తున్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్న సంగతి ప్రభుత్వ అధికారులకు విధితమే పట్టణ నడిబొడ్డులో ఉన్న ఈ స్థలంలో కొంత భాగం అన్యాక్రాంతం అయిపోయింది మిగతా స్థలాన్ని ఎవరికీ కట్టు పెట్టడానికి మున్సిపల్ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు అని పరిసర ప్రాంతం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.....

# కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

## – కండువా కప్పి ఆహ్వానించి ఎంఎల్ఏ తెల్లం వెంకట్రావ్





**చర్ల జూన్ 20 (మనం న్యూస్) :** చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. బీఆర్ఎస్‌కు చెందిన సొసైటీ మాజీ చైర్మన్ కొప్పినీడు బాబూరావు, సీనియర్ నాయకులు పెన్మెత్స సీతాపరిరాజు లతో పాటు పలువురు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చేరిన నాయకులకు ఎంఎల్ఏ కాంగ్రెస్ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు. నూతన చేరికలతో పార్టీ మరింత బలోపేతం అవుతోందని అన్నారు. ఈ కార్యక్రమం లో లంక రాజు, మేడబత్తిన వాసు, ఇర్ప వసంత్, బ్రహ్మానంద రెడ్డి లతో పాటు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఈతకు వెళ్లిన ముగ్గురులో ఒకరు మృతి

## – శోకసముద్రంలో తల్లి తండ్రులు

**గుండాల,జూన్20(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం నర్సాపురం తండా మల్లన్న వాగుకు ముగ్గురు చిన్నారులు ఈతకు వెళ్లి ఒకరు మృతి వివరాలలోకి వెళ్ళగా గుండాల మండలం నర్సాపురం గ్రామపంచాయతీ నరసాపురం తండాకు చెందిన ముగ్గురు చిన్నారులు మల్లన్న వాగు కు ఈతకు వెళ్ళగా గుగులోతు సీమోను.బానోతు రిషి.బోడ సంజు వెళ్లగా వాగులోకి సీమోను రిషి బట్టలు విప్పి వాగులో దూకగా వారు కొట్టుకుంటుండగా వడ్డు పైన ఉన్న బోడ సంజు పరుగులు తీసి గ్రామములోని పెద్దలకు చెప్పగా హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని గృహ కోల్పోయిన బానోతు రిషి ని సిపిఆర్ ద్వారా చేసి బతికించారు గుగులోతు సీమోను దరిదాపుగా పదిమంది ఈతగాళు మడుగులో దూకి వెతకగా సుమారు గంటన్నర వెతికారు అయినప్పటికీ దొరకలే భుఖ్య మంగమ్మ శ్రీను దంపతులు అక్కడికి చేరుకొని సర్పంచ్ భర్త శ్రీను వాగులో దిగి నీళ్లల్లో ఐదు నిమిషాలు వెతికి చనిపోయిన అబ్బాయిని బయటికి తీసుకొని వచ్చాడు ఆ మూలమలుపు వద్ద వ్యవసాయ నీరు కోసం జెసిపి ద్వారా పెద్ద



కందకం తీపించి ఉండడంతో లోతుగా ఏర్పడి వాటర్ ఎక్కువ ఉండటం తోటి చిన్నారులకు అంచనా దొరకక దూకే దూకడం నీళ్లలో అడుగుకి వెళ్లి మృతి చందడం జరిగింది ఘటన స్థలానికి సమాచారం అందుకున్న సిఐ తిరుపతి బృందంతో చేరుకొని కేసు నమోదు చేసి మృతుని ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగింది గ్రామంలో ఎల్లమ్మ గుడి ప్రతిష్ట జరుగుతుండగా ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి మృతుడు సీమోను ఇల్లందు ఆశ్రమ ప్రభుత్వ హాస్టల్లో నాలుగో తరగతి చదువుతున్నాడు

# అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం పై ప్రతిజ్ఞ

**భద్రాచలం, జూన్ 20( మనం న్యూస్ ):** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం ,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ వేడుకల సందర్భంగా హెచ్ఎం వార్డెన్ లతో ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరిగిందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు.శనివారం నాడు ఐటిడిఏ సమావేశం మందిరంలో ఈనెల 17 నుండి 26 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరిగే అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం వేడుకలు జరుగుతున్నందున గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణ పై విద్యార్థుల చర్చలు నిర్వహించడం, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా పిల్లలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో నిర్వహించాలని హెచ్ఎం లకు సూచించారు.అనంతరం హెచ్ఎం వార్డెన్ లకు మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.

**"ప్రతిజ్ఞ"**

నేను మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, నేను డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం కొనుగోలు మరియు అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని, నేను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పములో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను అని హెచ్ఎం వాటిల్లతో కలిసి ఐటీడీఏ పీవో ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన, ఖమ్మం డిడి విజయలక్ష్మి ,ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, డిఎంజిసిసి సమ్మయ, ఏసీఎంవోలు, హెచ్ఎం, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



# రాజీ మార్గమే రాజ మార్గం:

## – జడ్జి స్వరూప కాటం




**ఇల్లందు, జూన్ 20 (మనం న్యూస్) :** ఇల్లందు కోర్టు ప్రాంగణంలో శనివారం మండలా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్కార్యక్రమాన్నిఏర్పాటుచేసినారు .ఈకార్యక్రమానికి ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వరూప కాటం, ముఖ్యఅతిథిగా హాజరైనారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కక్షిదారులు గ్రామస్థాయిలో క్షణికావేశలకు వెళ్లకుండా సామరస్యంగా జీవనం గడపాలని, ఆదర్శ జీవితం గడపాలని, విలువైన సమయాన్ని డబ్బును వృథా చేసుకోకుండా పంతాలకు పోకుండా క్షణికావేశంలో పెట్టుకున్న రాజీ పడదగిన కేసులు ఇరుపక్షాలు సమన్వయంతో కోర్టుకి వచ్చి రాజి కుదుర్చుకొని ఈ లోక్ అదాలత్ నుసద్వినియోగంచేసుకోవాల్సిందిగా తెలిపినారు. గృహింస కేసులు, మనోవర్తి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్ ధావాలు,బ్యాంకు కేసులు, అన్ని కలిపి మొత్తం 807, కేసులు పరిష్కరించబడ్డాయని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్. కే. యం. డి కాసిం, సీనియర్ న్యాయవాదులు, ఎన్. మల్లికార్జునరావు, పి. బాలకృష్ణ, దంతాల ఆనంద్, పెద్దూరి వెంకట నరసయ్య, జూనియర్ న్యాయవాదులుకే.ఉమామహేశ్వరరావు, కీర్తి కార్తిక్, కోర్టు సూపరిడెంట్ శ్రీరంగం రామకృష్ణ, కోర్టు సిబ్బంది పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఉపాధ్యాయుడిపై చేయి చేసుకున్న వైద్యునిపై చర్యలు తీసుకోవాలని

## – ఆదివాసి, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్



**చర్ల, జూన్ 20 (మనం న్యూస్) :** చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కొరకు వెళ్లిన గిరిజన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పలక నాగేశ్వరావుపై అసభ్యకరమైన పదజాలంతో దూషించి సభ్యసమాజం తలదించుకునే విదంగా పరుష పదజాలం వాడి దాడికి పాల్పడిన మత్తు వైద్యుడు కృష్ణప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ, ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేసాయి. దుందుడుకు స్వభావంతో విచక్షణారహితంగా సెక్యూరిటీ గార్డు సందీప్ ఉపాధ్యాయుడి చేతులు పెడవిరిసి పట్టుకుంటే డాక్టర్ కృష్ణ ప్రసాద్ విచక్షణారహితంగా చేతులతో డాడీకి పాల్పడటం దుర్మార్గమని దాడికి పాల్పడ్డ వైద్యుడిని తక్షణమే సస్పెండ్ చేయ్యాలని ఉపాధ్యాయ, ఆదివాసీ సంఘాల జేఏసి డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా జేఏసీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఊయికె బాలకృష్ణ, శ్యామల రామారావు, ఎస్ ఎస్ ఎస్ రవికుమార్ మాట్లాడుతూ గౌరవ డాక్టర్ వృత్తిలో ఉండి వైద్య వృత్తికే చెడ్డ పేరు తీసుకొస్తున్న డాక్టర్ కృష్ణ ప్రసాద్ పై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. రోగుల్ని ప్రేమించలేని డాక్టర్ ఒక రోగితో సమానమని మండిపడ్డారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం వైద్యులు ప్రజలతో సన్నితంగా ఉండి వారిని ప్రేమగా దగ్గరికి తీసుకొని వైద్యం చేయాలి కానీ వృత్తి ధర్మాన్ని మరిచి రోగులపై చేయించుకున్న డాక్టర్ కృష్ణ ప్రసాద్ ను తక్షణమే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేసారు.ఈ సమావేశంలో నీలం వెంకటరమణ, కుర్ల రాము, చిడెం హిమగిరి బాబు, పున్నం వెంకటరమణ, తోటపల్లి రమేష్, కుర్ల మోహన్ రావు,కాపుల కృష్ణార్జునరావు, శ్యామల రామారావు, ఊయికే బాలకృష్ణ, కోరం సూర్యనారాయణ, దేశ వీర్రాజు, ఇరుప రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కిస్తీ కట్టలేదని బైక్ సీజ్..?

- ముందస్తు నోటీసు ఇచ్చారా లేదా..?
- కొత్తగూడెంలో ఫైనాన్స్ వ్యవహారం చర్చనీయాంశం







**కొత్తగూడెం, టౌన్, జూన్ 20 (మనం న్యూస్) :** రుణంపై కొనుగోలు చేసిన వాహనాల స్వాధీనం విషయంలో వినియోగదారుల హక్కులపై మరోసారి చర్చ మొదలైంది. చుంచుపల్లి మండలం అంబేద్కర్‌నగర్‌కు చెందిన గడ్డం మోహన్‌రావు ఫైనాన్స్‌పై కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనాన్ని తనకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లారని ఆరోపిస్తున్నారు. కొన్ని కిస్తీలు బకాయి ఉన్నాయని పేర్కొంటూ తన కుమారుడి వద్ద నుంచి వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని తాను చెల్లింపులకు సిద్ధంగా ఉన్నప్పటికీ అవకాశం ఇవ్వలేదని ఆయన చెబుతున్నారు. వాహనం తిరిగి పొందేందుకు పెండింగ్ కిస్తీలతో పాటు అదనపు ఛార్జీలు చెల్లించాలని కోరుతున్నారని ఆరోపించారు. ఈ ఘటన నేపథ్యంలో వాహన స్వాధీనానికి ముందు నోటీసులు జారీ చేశారా, అదనపు ఛార్జీలు ఏ నిబంధనల ప్రకారం విధిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై సంబంధిత ఫైనాన్స్ సంస్థలు, డీలర్ యాజమాన్యం స్పందించి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# పరీక్షలకు పోలీస్ కవచం

- కేంద్రాల పరిసరాల్లో సెక్షన్-163 అమలు
- పరీక్షల నేపథ్యంలో 500 మీటర్ల పరిధిలో ఆంక్షలు
- గుంపులు, ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదు : ఎస్పి



**కొత్తగూడెం క్రైమ్, జూన్ 20 (మనం న్యూస్ ) :** జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న నీట్-2026 ప్రవేశ పరీక్షను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో బీఎన్ఎస్ఎస్ సెక్షన్-163 కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, జూలూరుపాడు, అశ్వారావుపేట, చుంచుపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల పరిసరాల్లో జూన్ 21 ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించిన వ్యక్తులు గుమికూడడం, సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు, నినాదాలు నిర్వహించడం నిషేధం అని స్పష్టం చేశారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు, విధుల్లో ఉన్న సిబ్బంది, పోలీసు అధికారులు మినహా ఇతరులు పరీక్ష కేంద్రాల వద్ద అనవసరంగా సంచరించవద్దని సూచించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకుని అవసరమైన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. ఎస్పీ సూచనలు పరీక్ష కేంద్రాల వద్ద గుమికూడరాదు. ర్యాలీలు, ధర్నాలు, సమావేశాలు నిర్వహించరాదు. కేంద్రాల 500 మీటర్ల పరిధిలో ఆంక్షలు అమల్లో ఉంటాయి.అభ్యర్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు

# ఒక్కరికి ఒకే ఓటు.. అర్హులందరికీ ఓటు హక్కు

### ఓటరు జాబితా సవరణపై అవగాహనా సదస్సు

### రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రక్రియ : తహశీల్దార్ వినయేందర్ రెడ్డి

**ఖమ్మం రూరల్, జూన్ 20 (మనం న్యూస్):** అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించి ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, పటిష్ఠంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం రూరల్ తహసిల్దార్ వినయేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఖమ్మం రూరల్ మండలంలోని 101 పోలింగ్ కేంద్రాలకు చెందిన బీఎల్‌వోలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులతో ఓటరు జాబితా నవీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఒక్కరికి ఒకే ఓటు అనే సూత్రాన్ని అమలు చేయడంలో ఎన్నికల సంఘం కట్టుబడి ఉందన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు కావడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపునకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గతంలో నమోదైన ఓటర్ల వివరాలను ఆధారంగా తీసుకుని సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రాలను సేకరించి మ్యాపింగ్ ప్రక్రియ చేపడుతున్నట్లు వివరించారు. కుటుంబంలో ఇప్పటికే ఓటు హక్కు కలిగిన సభ్యుల ఆధారంగా ఇతర అర్హుల వివరాలను గుర్తించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు లేదా సంబంధిత వ్యక్తులు అందుబాటులో లేని సందర్భాల్లో కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు సేకరించి ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు.



బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పనిచేసి ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరణించిన వారి పేర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వెళ్లిపోయిన వారి పేర్లు, అనధికారికంగా నమోదైన ఓట్లను తొలగించే ప్రక్రియ కూడా కొనసాగుతోందన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా ప్రజాప్రతినిధులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం నిపుణులు ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు చేర్పులు, దరఖాస్తుల పరిశీలన తదితర అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ రవీందర్, ఆర్ఐ జానీ, జీపీఓ కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు తదితరులు పాల్గొన్నారు.



# రాఘవాపురంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు ముమ్మర సన్నాహాలు

### -- ముఖ్య అతిథిగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

**సుజాతనగర్, జూన్ 20 (మనం న్యూస్)** రాఘవాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని నిర్ణయిస్తూ శనివారం అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కమిటీ ఆధ్వర్యంలో గుండేటి వెంకట రాములు అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రముఖ న్యాయవాది మారపాక రమేష్, మాదిగ ఐక్యవేదిక మండల అధ్యక్షులు వేల్పుల భాస్కర్, మాదిగ జేఏసీ అధ్యక్షులు చదలవాడ సూరి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభోత్సవ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. గ్రామ ప్రజల ఐక్యతతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు, మాజీ ఉపసర్పంచ్ మంద రాజు, బుడగ జంగాల జిల్లా అధ్యక్షులు సిరిగిరి మురళి, కాంగ్రెస్ నాయకులు నాగార్జున, మురిపిటి రాములు, గుండేటి గోపయ్య, మురిపిటి నాగేష్, మురిపిటి మాధవరావు, దూడపాక శివప్రసాద్, గరిక వెంకటనారాయణ, గోవర్ధన్, గుండేటి పెద్ద రాములు, కాకటి రాంబాబు, మురిపిటి గణేష్, గుండేటి బాలకృష్ణ, గుండేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కంతమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

### పాల్గొన్న తుంబూరు దయాకర్ రెడ్డి





**నేలకొండపల్లి, జూన్ 20 (మనం న్యూస్) :** మండల పరిధిలో రాజేశ్వరపురం గ్రామంలో కంతమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ గృహ, నిర్మాణ, సమాచార శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంఛార్జి తుంబూరి దయాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడి పంటల తో కళకళ లాడాలని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం ని ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొడాలి గోవింద రావు, నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు,మాజీ మార్కెట్ చైర్మన్ శాఖమూరి రమేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు,మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య,ఎర్రబోయిన నర్సయ్య,గ్రామయువకులు పాల్గొన్నారు.

# ఆయిల్‌ఫామ్ సాగుపై అవగాహనా సదస్సు



**నేలకొండపల్లి, జూన్ 20 (మనం న్యూస్) :** నేలకొండపల్లి మండల పరిధిలోని రాజేశ్వరపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రైతు వేదికలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశం లో రాజేశ్వరపురం సర్పంచ్ రంగయ్య మరియు మోటాపురం సర్పంచ్ రామారావు , సుబ్బారావు, ఆగ్రోనామిస్ట్ కంపెనీ, కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు యం. సతీష్, పాలేరు డివిజన్ ఉద్యాన అధికారి అపర్ణ, నేలకొండపల్లి మండల వ్యవసాయ అధికారి వీ. రాధ, మధిర డివిజన్ ఉద్యాన అధికారి విష్ణు, వ్యవసాయ మరియు ఉద్యాన విస్తరణ అధికారులు మరియు ఆయిలఫెడ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశం లో రైతులకు ఆయిల్ పామ్ సాగు కి ప్రభుత్వం నుండి వచ్చే రాయితీల వివరాలు గురించి తెలియజేయడం జరిగింది.అలాగే ఆయిల్ పామ్ సాగు లో మొదటి నాలుగు సంవత్సరాలలో చేపట్టవలసిన సాగులో మెలుకువలు మరియు నీటి యాజమాన్యం,బిందు సేద్యం అవశ్యాకత మరియు ఎరువుల యాజమాన్యం లో మెలుకువలు, అలాగే ఆయిల్ పామ్ లో అంతర పంటల సాగు లో మెలుకువలు తదితర ముఖ్యమైన అంశాల గురుంచి తెలిపారు. సాగు లోని వారు ఎదుర్కొనే సమస్యలనుఅడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బి నరేష్ టి జి ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీస్ పాల్గొన్నారు.



# స్టూడెంట్ వాయిస్ పేరుతో కేంద్రంపై ఆందోళనలు

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్

**ఖమ్మం, జూన్ 20(మనం బ్యూరో):** నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం ప్రభుత్వం బాధ్యతవహించాలని, లీకేజీ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్టూడెంట్ వాయిస్ పేరుతో ఆందోళనలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వల్ల లక్షల మంది విద్యార్థులు తీవ్ర నిరాశ నిస్పృహలకు గురి అయ్యారని అన్నారు. ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణపై ఎన్నో అపోహలున్నాయని, బిజెపి ప్రభుత్వం కుటిల రాజకీయ చతురతకు నిదర్శనం అని అన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 22న సాయంత్రం 3.00 గంటలకు సప్తపది ఫంక్షన్ హాల్ లో నారి భేరి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మహిళల కోసం ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, భవిష్యత్‌లో ఎన్నో పథఖాలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని మహిళలు జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా ఆర్‌టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, సయ్యద్ గౌస్, పుచ్చకాయల వీరభద్రం, బొడ్డు బొందయ్య, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు భానోత్ వినోద, రేఖా భార్గవి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# ‘సర్’ పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ఖమ్మం, జూన్ 20(మనం బ్యూరో):** ‘సర్’ కార్యక్రమం పట్ల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి బిఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్‌లో ఖమ్మంలో ఓట్లు 3,లక్షల 26 వేలు ఉంటే....సగం ఓట్లు కూడా మ్యాపింగ్ జరగ లేదన్నారు. మొన్న ఎన్నికలు జరిగిన బెంగాల్, తమిళనాడు లో ఓట్లు మ్యాపింగ్ జరగకపోవడంతో అక్కడ అధికార పార్టీలు ఓటమి పాలయ్యాయని అన్నారు. ప్రతి ఓటూ పోకుండా జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఈ ప్రక్రియలో బిఎల్ఓ, బిఎల్ఏలే ముఖ్యమని, ఓటర్ల జాబితాను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికలలో పెద్ద పర్సంటేజీతో గెలవలేదని, మూడు శాతం ఓట్ల తోనే గెలిచామని అన్నారు. ఇప్పుడు 50 శాతం ఓట్లు మ్యాపింగ్ జరగలేదు, ఫలితాలు తారుమారవుతాయన్నారు. 90 లక్షల ఓట్లు తొలగించారు. అప్పీల్ చేసుకుంటే 30 లక్షల ఓట్లు మాత్రమే అవకాశం కల్పించారు. రాజకీయాలలో ఉండాలంటే ఓటర్ల లిస్ట్ ను చూసుకోవాలని సూచించారు. ఇది జీవనమరణ సమస్య అని, జాతీయ, రాష్ట్ర నాయకత్వం చాలా సీరియస్ గా ఉందని, ఓటర్ల జాబితాను పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేషన్ అధ్యక్షులు దీపక్ చౌదరి పాల్గొన్నారు.

# పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

## – నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు



**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 20 (మనంప్రతినిధి):** నేడు నిర్వహించనున్న నీట్ (ఎన్ ఇ ఇ టి) పరీక్షకు సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్తో కలిసి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.పరిశీలనలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన నాలుగు పరీక్షా కేంద్రాలైన టీజీఎస్డబ్ల్యూఆర్ బాలికల పాఠశాల మరియు జూనియర్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల పాల్వంచ, శ్రీ రామచంద్ర ఆరట్స్ అండ్ సైన్స్ కళాశాల కొత్తగూడెం, సింగరేణి ఉమెన్స్ కళాశాల కొత్తగూడెంలలో కలెక్టర్ తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ కౌంటర్లు, బయోమెట్రిక్ ధృవీకరణ కేంద్రాలు, పరీక్షా గదులు, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ, జామర్ల ఏర్పాటు, అలారాలు, గోడ గడియారాలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న నీట్ పరీక్షకు మొత్తం 1,128 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్–163 అమల్లో ఉంటుందని అన్నారు . పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలను పరీక్షా సమయాల్లో మూసివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని, అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సెల్ఫోన్లు, స్మార్ట్ వాచ్లు, బ్లూటూత్ పరికరాలు, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని అభ్యర్థులకు సూచించారు.పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పరీక్షల నిర్వహణలో పాల్గొనే అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో విధులు నిర్వర్తించి పరీక్షలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, తహశీల్దార్లు ధారా ప్రసాద్, పుల్లయ్య, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షాన...

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. రైతులు ఎదుర్కొంటున్న పంట కొనుగోలు సమస్యలు, గిట్టుబాటు ధరలు, సాగునీటి ఇబ్బందులు, ఎరువులు, విత్తనాల కొరత, విద్యుత్ సమస్యలు వంటి అనేక అంశాలపై కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకొచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో రైతుల ఖాతాల్లో నేరుగా పెట్టుబడి సాయం జమ చేసి, రైతు కుటుంబాలకు భరోసా కల్పించి, తెలంగాణను వ్యవసాయ రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపిందన్నారు. ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతుకు అండగా నిలవాలనే విధానాన్ని నాడు కేసీఆర్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిందని తెలిపారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రం నిర్దేశించిన కోటాకు పరిమితం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి పంటను చివరి గింజ వరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాలని కోరారు. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అవసరమైతే రైతు సంఘాలతో కలిసి బీఆర్ఎస్ పార్టీ మరో ఉద్యమానికి సిద్ధంగా ఉంటుందని, రైతు సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ప్రధాన లక్ష్యమని, అన్నదాతకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేసారు.

# ప్రాధాన్యతా రంగాలకు....

(మొదటి పేజీ తరువాయి)

(114.55 శాతం), అగ్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద రూ.31.41 కోట్ల లక్ష్యానికి గాను రూ.19.09 కోట్లు (58.71 శాతం), అనుబంధ వ్యవసాయ కార్యకలాపాల కింద రూ.159.97 కోట్ల లక్ష్యానికి గాను రూ.825.40 కోట్లు (515.97 శాతం) మంజూరు చేసినట్లు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగంలో రూ.847.80 కోట్ల లక్ష్యానికి గాను రూ.703.88 కోట్లు మంజూరు చేసి 83.02 శాతం సాధన నమోదైంది. విద్యా రుణాల కింద రూ.25.39 కోట్ల లక్ష్యానికి గాను రూ.11.21 కోట్లు (44.15 శాతం), గృహ రుణాల కింద రూ.233.62 కోట్ల లక్ష్యానికి గాను రూ.255.22 కోట్లు (109.25 శాతం) మంజూరు చేసినట్లు తెలిపారు. సామాజిక మౌలిక వసతుల రంగంలో రూ.3.30 కోట్ల లక్ష్యానికి గాను రూ.0.34 కోట్లు మాత్రమే మంజూరు కావడంతో 10.30 శాతం సాధన నమోదైందన్నారు. ఈ సందర్భంగా రైతు రుణాల పంపిణీ అంశంపై బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పంట రుణాల పంపిణీ లక్ష్య సాధన తక్కువగా ఉన్న బ్యాంకుల అధికారులను కారణాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ రుణాలను సకాలంలో పునరుద్ధరించుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రైతు భరోసా, ఆసరా పింఛన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యే నిధులను ఇతర రుణాల బకాయిల పేరుతో నిలుపుదల చేయరాదని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ప్రయోజనాలు అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ రంగం, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అర్హులైన రైతులు, యువ పారిశ్రామికవేత్తలకు అవసరమైన రుణ సహకారం అందించాలని అన్నారు . జిల్లాలో ఉపాధి, ఆర్థికాభివృద్ధికి దోహదపడే విధంగా బ్యాంకులు రుణాల పంపిణీలో మరింత చొరవ చూపాలని సూచించారు. పునరుత్పాదక ఇంధన రంగంలో రూ.3.24 కోట్ల లక్ష్యానికి గాను రూ.18.73 కోట్లు మంజూరు చేసి 578.09 శాతం సాధన నమోదవడం సానుకూల పరిణామమని కలెక్టర్ అన్నారు . ఇతర విభాగాల్లో రూ.152.35 కోట్ల లక్ష్యానికి గాను రూ.86.62 కోట్లు మంజూరు చేసి 56.86 శాతం సాధన నమోదైనట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాల బ్యాంకు అనుసంధానం, నిరర్థక ఆస్తుల (ఎన్పీఏ) తగ్గింపు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాలైన పీఎం స్వనిధి, పీఎంఈజీపీ, పీఎం ముద్ర, పీఎం విశ్వకర్మ, పీఎంఎఫ్ఎంఈ, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (ఏఐఎఫ్) అమలుపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం 2026–27 ఆర్థిక సంవత్సరానికి భారతీయ స్టేట్ బ్యాంక్ రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆవిష్కరించారు. రూ.8,914 కోట్ల లక్ష్యంతో రూపొందించిన ఈ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.4,593 కోట్లు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగానికి రూ.889 కోట్లు, ఇతర ప్రాధాన్యతా రంగాలకు రూ.221 కోట్లు, ఇతర రంగాలకు రూ.3,211 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, రిజర్వ్ బ్యాంక్ అధికారులు, నాబార్డ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామ సేవా యజ్ఞం

**-100 మందికి ఉచిత హోమియో మందుల పంపిణీ**
**– మాస్టర్ ఈ.కే. శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా**
**రామవరం శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వైద్య శిబిరం**



**రామవరం, జూన్ 20 (మనం న్యూస్) :** మాస్టర్ ఈ.కే. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మాస్టర్ ఈ.కే. ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్ రామవరం నాగయ్యగడ్డలో ఉన్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో శనివారం గ్రామ సేవా యజ్ఞం, ఉచిత హోమియో వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఈ.కే. ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం బ్రాంచ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన రవిచంద్ర ఆధ్వర్యంలో 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ--వెంకటేశ్వర్లు దంపతులు గ్రామ సేవా హోమం, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రామవరం ప్రాంత ప్రజలకు ఉచిత హోమియో వైద్య సేవలు అందించారు. ప్రతి రోగికి వారి ఆరోగ్య సమస్యలను పరిశీలించి, ప్రత్యేక కేస్ షీట్లు రూపొందించి, దీర్ఘకాలిక వ్యాధుల స్వభావాన్ని బట్టి ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఆరోగ్యానికి కేవలం ఔషధ సేవ మాత్రమే కాకుండా సరైన ఆహార విహారాలు, ప్రకృతితో మరియు తోటి మనుషులతో సత్సంబంధాలు కూడా ఎంతో ముఖ్యమని అన్నారు. వ్యక్తిగత జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ప్రవర్తనను మెరుగుపరచుకుంటే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, ఆనందంగా జీవించగలరని పేర్కొన్నారు. అనంతరం సుమారు 100 మంది రోగులకు ఉచిత హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఈ.కే. ఆధ్యాత్మిక సేవా సంస్థ సభ్యులు జి.లత, ఆర్.రామారావు, కె.శ్రీనివాసరెడ్డి, కె.స్వామి, సౌజన్య, వీరమల్లు, పి.శ్రీధర్‌రావు, బి.కోటేశ్వరరావు, కె.కమల, నాగేశ్వరరావు, బి.వి.చారి, ఎస్.మనోహర్ కుమార్, కె.శ్రీనివాస్, ఎం.డి.ఫజల్ పాల్గొన్నారు. అలాగే శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ నిర్వాహకులు ఫణికుమార్, పితాని అబ్బులు, జూపాక రమేష్, నజీర్, పాటి మోహన్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# రెట్రో రిఫ్లెక్టివ్ టేప్ విధానాన్ని రద్దు చేయాలి

**- క్యూఆర్ కోడ్ నిబంధనతో వాహనదారులపై మోయలేని ఆర్థిక భారం**
**- ప్రైవేట్ కంపెనీల దోపిడీకి రవాణా శాఖ ఊతమివ్వడం దుర్మార్గం**
**- ఆటో డ్రైవర్లను, వాహన యజమానులను నిలువునా ముంచుతున్న నిబంధనలు**
**- టేపుల పేరుతో రేట్లు పెంచి చేస్తున్న దోపిడీని తక్షణమే ఆపాలి**
**- చట్టంలో లేని నిబంధనలను గుట్టుగా అమలు చేయడంపై ఉద్యమిస్తాం**
**- ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య**



**కొత్తగూడెం టౌన్ జూన్ 20 (మనం న్యూస్) :** కొత్తగూడెం : రెట్రో రిఫ్లెక్టివ్ టేప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఈ విధానం వల్ల ఆటో డ్రైవర్లతో పాటు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు, ఆర్థిక నష్టం కలుగుతున్నాయని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెం పరిధిలోని ఆర్టీఏ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో శనివారం భారీ ధర్నా నిర్వహించి, అనంతరం ఆర్టీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటారు వాహన చట్టంలో ఎక్కడా లేకపోయినా రవాణా శాఖ వీటికి కొత్తగా క్యూఆర్ కోడ్ నిబంధనను చేర్చి ప్రైవేట్ కంపెనీల దోపిడీకి ఊతమిస్తోందని మండిపడ్డారు. గతంలో వాహనదారుల ఆందోళనలతో వెనక్కి తగ్గిన రవాణా శాఖ, ఇప్పుడు మళ్లీ గుట్టుగా ఈ దోపిడీ విధానాన్ని అమలులోకి తెచ్చిందని విమర్శించారు. సాధారణ రిఫ్లెక్టివ్ టేపుల కంటే రెట్టింపు ధరలతో విక్రయిస్తూ, వాహనం చుట్టూ 22 మీటర్ల నుంచి 26 మీటర్ల వరకు టేపులను అతికించాలనే కొత్త నిబంధనతో ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు, లారీలు, బస్సుల యజమానులపై వేలాది రూపాయల అదనపు భారం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఒకే ఒక్క ప్రైవేట్ కంపెనీకి లాభం చేకూర్చడం కోసమే ఈ దోపిడీకి రంగాన్ని సిద్ధం చేశారని, తక్షణమే ఈ నిబంధనలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, చింటూ, సురేష్, మోహన్, శీను, సోను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలకు నాంది..

**– బేతాళుపాడులో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం**
**– డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న చేతుల మీదుగా నూతన గృహ ప్రారంభం -- "ఇందిరమ్మ ఇల్లు అంటే కుటుంబ గౌరవానికి చిరునామా"**



**సుజాతనగర్, జూన్ 20 (మనం న్యూస్):** సుజాతనగర్ బేతాళుపాడు పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన గృహాన్ని డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న శనివారం బేతాళుపాడు గ్రామంలో ప్రారంభించారు. లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేసిన ఆమె, కొత్త ఇంట్లో పాలు పొంగించి దీపం వెలిగించి వారి ఆనందంలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇల్లు అంటే కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించిన భవనం కాదు.. అది ఒక తల్లి భద్రత, ఒక పిల్లాడి భవిష్యత్తు, ఒక కుటుంబం ఆత్మగౌరవానికి ప్రతీక" అని పేర్కొన్నారు. పేదలకు గౌరవప్రదమైన జీవనం కల్పించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. ఇందిరా గాంధీ ఆశయాలకు ప్రతిరూపంగా, రాహుల్ గాంధీ స్ఫూర్తితో పేదల కష్టాలను తీర్చే దిశగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా అద్దె ఇళ్లలో జీవిస్తున్న కుటుంబాలకు సొంత గూడు అందించడం ఆనందంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఎలాంటి అవినీతి, లంచాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకతతో ఇళ్లను మంజూరు చేసి నిర్మించి ఇస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, బాలాజీ, లక్ష్మీనారాయణ, మహేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పిల్లల భవిష్యత్తే లక్ష్యం..

**– జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో ఆకస్మిక తనిఖీ చేసిన దేవి ప్రసన్న**





**సుజాతనగర్, జూన్ 20 (మనం న్యూస్) :** సుజాతనగర్ మండలం గరీపేట జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి వారి చదువు, ఆటలు, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. డిజిటల్ క్లాస్‌రూమ్‌ను సందర్శించి బోధనా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. అలాగే పాఠశాల ఆవరణ పరిశుభ్రత, పచ్చదనాన్ని పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశమై విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు కోనేరు సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీలు ఎం ప్రసాద్ బాబు, పైడా రాజేంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్ వీర హనుమంతరావు, జై సంవిధాన్ నాయకులు అర్జున్ రావు, కాంతోటి పాల్, సర్పంచ్ దివ్య తేజ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్రా అజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు రామ్మూర్తి, ఉపేందర్, కాంగ్రెస్ నాయకులు చిమ్మట నాగేశ్వరరావు, మాడేపల్లి శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం లీలా, ఉపాధ్యాయులు జహంగీర్ షరీఫ్, జి నరేష్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.